



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

రంగారెడ్డి
వికారాబాద్
మేడ్చల్

బుధవారం 17 సెప్టెంబర్ 2025 పేజీలు 11

## 3న కొడంగల్‌కు రానున్న సీఎం రేవంత్ రెడ్డి



కొడంగల్, మేజర్ న్యూస్ (సెప్టెంబరు 16): రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అక్టోబరు 3న కొడంగల్‌కు రాను న్నారు. సొంత గ్రామం వంగూర్ మండలం కొండా రెడ్డిపల్లిలో దసరా ఉత్సవాల్లో పాల్గొని మరుసటి రోజు అక్టోబరు 3న కొడంగల్ పర్యటనతో పార్టీ శ్రేణులను కలవ నున్నట్లు సమాచారం. కొండా రెడ్డిపల్లిలో కుటుంబ సభ్యులతో దసరా వేడుకల అనంతరం కొడంగల్‌కు వెళ్లడం సీఎం ఆనవాయితీగా చేసుకున్నారు. సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి దసరా ఉత్స వాల్లో పాల్గొనడం ఇది రెండో సారి.

## కాళ్లు మొక్కినా కనికరించలేదు...

**- పీర్జాదిగూడలో పేదల ఇండ్లపై బుల్డోజర్ - కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన బాధితులు - తమ ఇల్లు కూలిస్తే చస్తామంటూ.. పెట్రోల్ పోసుకున్న యువకుడు.. - కూలి పని చేసుకుని బ్రతుకుతున్నాం - అధికార పార్టీ నాయకులు 3 లక్షలు డిమాండ్ చేస్తున్నారని బాధితుల ఆరోపణ**



మేడిపల్లి, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ సర్వే నెం 199 వీకర్ సెక్షన్ కాలనీ లో రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరిట చేపట్టిన పేదల ఇండ్ల కూల్చి వేతలు ఉద్రిక్తతకు దారితీసింది. గత 25 ఏండ్ల గా ఇక్కడే నివాసం ఉంటున్నామని చిన్నపాటి రేకుల ఇల్లే మాకు జీవనాధారం.. మిగతా 2లో

## తూముకుంటలో అక్రమ నిర్మాణం సీజ్

సూర్య న్యూస్ ఎఫెక్ట్..

### "సూర్యలో వార్త.. అధికారుల సీజ్"




**శామీర్‌పేట్,మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):** సూర్యలో అక్రమ నిర్మాణాల వార్త వెలువడిన వెంటనే అధికారులు కదిలారు. తూము కుంట మున్సిపాలిటీ 7వ వార్డు సాయినగర్ కాలనీలో సర్వే నంబర్ 334లో నోముల మధుసూదన్ రెడ్డి, నోముల సులోచన రెడ్డిలు అనుమతులు లేకుండా కట్టుతున్న కన్వెన్షన్ సెంటర్పై మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. 14వ తేదీన నోటీసు ఇచ్చినా లెక్క చేయకపోవడంతో, 16న టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీధర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని నిర్మాణాన్ని సీజ్ చేశారు. కమీషనర్ ఎం.ఎన్.ఆర్. జ్యోతి ఈ విషయం పై మాట్లాడుతూ, "అక్రమ నిర్మాణాలను ఏవీ సహించం. నిబంధనలు అతిక్రమిస్తే ఎంత పెద్దవారైనా కఠిన చర్యలు తప్పవు. తూముకుంట మున్సిపాలిటీలో ఇలాంటి నిర్మాణాలు మళ్లీ జరగకుండా కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తాం" అని హెచ్చరించారు. స్థానికులు సూర్య నేటి దిన పత్రిక న్యూస్ ఎఫెక్ట్‌కు హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి అక్రమ నిర్మాణాలపై ఇకపై కూడా చర్యలు వేగంగా కొనసాగించాలని కోరుతున్నారు.

# ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా చూడాలి

### బతుకమ్మ ఘాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి





మహేశ్వరం, మేజర్ న్యూస్ (సెప్టెంబరు16) : బతుకమ్మ ,దేవి నవరాత్రులకు వచ్చే ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ రావిర్యాలలో బతుకమ్మ, దేవి శరన్నవరాత్రి పండుగల సందర్భంగా రావిరాల చెరువు ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ ..బతుకమ్మ, బోనాల పండుగలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌దని గుర్తుచేశారు. ఒకప్పుడు చెరువులు మురికి కుప్పాలుగా ఉండేవి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిషన్ భగీరథ, ఎస్ఎన్‌డిసి నాలాల్ నిర్మించి, పూడికతీతల ద్వారా చెరువులు అతి సుందరంగా తీర్చిదిద్దబడ్డాయని తెలిపారు.

గత ప్రభుత్వ కాలంలో ముదిరాజులు, గంగపుత్రుల జీవనోపాధి కోసం ప్రభుత్వం చెరువుల్లో చేపలు విడిచేవారని, కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రెండేళ్లుగా ఒక్క చెరువులో కూడా చేపలు విడలేదని మండిపడ్డారు. ముదిరాజులు, గంగపుత్రుల జీవనోపాధి పట్ల ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. విజన్ ఉన్న నాయకుడైన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ బోనాల పండుగల కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేవారని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణీ, బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జెల్లల లక్ష్మయ్యయాదవ్, యూత్ అధ్యక్షులు సామేల్ రాజ్, మాజీ కౌన్సిలర్లు బాదవిత్ రవినాయక్, రెడ్డిగళ్ల సుమన్, నాయకులు బాట సురేష్, బ్యాగరి సురేష్, వీరేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు..!

- గొర్రెలు, మేకలే వారి టార్గెట్
- షాద్‌నగర్‌లో ఎనమిది మంది ముఠా అరెస్టు
- రూ.2.62 లక్షల నగదు, నాలుగు కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసిపి లక్ష్మినారాయణ








షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (సెప్టెంబరు 16): వారంతా జల్సాలకు అలవాటు పడ్డారు...విలాసవంతమైన జీవితం గడపాలంటే డబ్బు సంపాదించాలనుకున్నారు. దొంగతనాలు చేస్తే చాలా డబ్బు వస్తుందని బావించిన వారంతా ఒక నిర్ణయానికి వచ్చారు. ఊరుబయట ఉండే గొర్రెలు, మేకలను సులువుగా దొంగిలించి సొమ్ము చేసుకోవచ్చని బావించిన వారంతా ఉదయం సమయంలో కిరాయికి తెచ్చుకున్న కార్లలో రెక్కి చేసి రాత్రి సమయంలో మేకలను, గొర్రెలను అపహరించి హైదరాబాద్‌లో విక్రయించడం పనిగా పెట్టుకున్నారు. మిగతా 2లో

# జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు..!

**మొదటిపేజీ తరువాయి...**

ఇదే తరహాలో మరో దొంగతనం చేయడానికి ప్రయత్నిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా షాద్‌నగర్ పోలీసులు వారిని పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి మంగళవారం షాద్‌నగర్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షాద్‌నగర్ ఏసిపి లక్ష్మినారాయణ వి వ రాలు వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలంతో పాటు కర్ణాటక, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన మహ్మద్ ఫిరోజ్, అబ్దుల్ కలీమ్, మహ్మద్ సోహైల్, షేక్ రవూఫ్, మహ్మద్ జమీర్, మహ్మద్ అరీఫ్, షేక్ హసనుద్దీన్, కోయల్‌కర్ సాయికిరణ్‌లు ఈ ముఠాలో సభ్యులు. చిన్నతనం నుండి చెడు స్నేహాలకు అలవాటు పడి మత్తు పదార్థాలకు బానిసైన యువకులు డబ్బు కోసం దొంగతనాలను ఎంచుకున్నారు. దొంగతనాలను చేయడానికి వీలుగా నాలుగు కార్లను అందుబాటులో ఉంచుకుంటారు. ప్రతి రోజు ఈ వాహనాలలో తిరుగుతూ మేకలు, గొర్రెల మంద ఎక్కడెక్కడ ఉందో రెక్కీ నిర్వహిస్తారు. రాత్రి కాగానే డీసిఎం తీసుకువెల్లి దర్జాగా ఆ మేకలను, గొర్రెలను అందులో ఎక్కించి హైదరాబాద్‌లోని జియాగూడ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. ఇది దినచర్యగా పెట్టుకున్న వీరంతా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని చించోడ్‌లో 28, వెలిజర్లలో 8, చౌదరిగూడలో 8, ఎల్కిచర్లలో 23, కొందుర్గు మండలం తంగెడుపల్లిలో 8, వెంకిర్యాలలో 9, వికారాబాద్ జిల్లా పరిగి మండలం కోటివాడలో 12, సుల్తాన్‌పూర్‌లో 30, దోమ మండలం ఉందంతారావు పల్లిలో 15, దిర్సంపల్లిలో 6 మేకలను దొంగిలించారని ఏసిని తెలిపారు. ఇందులో బాగంగానే ఈ నెల 14న సోలీపూర్ శివారులో మేకల దొంగతనానికి ప్రయత్నిస్తుండగా షాద్‌నగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. బాధితుడైన పీర్లగూడ గ్రామానికి చెందిన బొగ్గుల ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితుల నుండి రూ.2.62 లక్షల నగదుతో పాటు ఏడు సెల్‌ఫోన్‌లు నాలుగు వాహనాలు స్వాదీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శంషాబాద్ డిసిపి రాజేశ్ పర్యవేక్షణలో సిసిఎస్ డిసిపి ముత్యంరెడ్డి, అడిషనల్ డిసిపి పూర్ణచంద్రరావు, శంషాబాద్ అడీషనల్ డిసిపి రామ్‌కుమార్, శ్రీలక్ష్మిల నేతృత్వంలో విచారణ జరగగా షాద్‌నగర్ ఏసిపి లక్ష్మినారాయణ. పట్టణ సిఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో ఎస్‌ఐలు పవన్‌కుమార్, అవినాష్‌బాబు, శ్రీనివాస్, భూపాల్, శివారెడ్డి సిబ్బంది కుమార్, మహేందర్, జాకీర్, నవీన్, రమేశ్, రవి, భీమయ్య, రవీందర్, కరుణాకర్, మోహన్‌లాల్, రాజు, సంతోష్‌లు కేసు చేదనలో చాకచక్యంగా వ్యవహరించారని వారికి ఉన్నతాదికారుల నుండి తగిన రివార్డులను అందించడం జరుగుతుందన్నారు.

# బాధితుల కుటుంబానికి అండగా నిలిచిన బీఎస్పీ నాయకులు వద్దిగల్ల బాబు



తుర్కయంజాల్, మేజర్ న్యూస్,( సెప్టెంబర్ 16) : సూర్యాపేటకు చెందిన సంపేట శ్రీను గౌడ్ బ్రతుకుదెరువు కోసం వచ్చి సుమారు 15 సంవత్సరాల నుండి అబ్దుల్లాపూర్ మెట్టు మండల పరిధిలోని కోహెడ గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి అద్దె ఇంట్లో ఉండి జీవనం సాగిస్తున్నాడు.అలా ఉండగా శ్రీను గౌడ్ గీత కార్మికుడిగా, తన భార్య సంపేట రేణుక దినసరి కూలీగా పని చేస్తూ జీవనం గడుపుతున్నారు. సంవత్సరం క్రితం సంపేట శ్రీను గౌడ్ కి రెండు కిడ్నీలు ఫెయిల్ అవడంతో ఓవైసీ హాస్పిటల్ లో వారానికి మూడు సార్లు డయాలసిస్ చేసుకుంటూ అంచానికే పరిమితం అయ్యాడు.ఇదే క్రమంలో గత కొన్ని రోజుల క్రితం భార్య రేణుక ఇంట్లో కాలు జారి పడడంతో ప్రక్కటేముక విరగడంతో బంధువుల సహాయంతో హాస్పిటల్ లో చేర్చి సర్జరీ చేయించగా 2 లక్షల రూపాయలు ఖర్చు ఆయ్యింది. భార్య విషయం తెలుసుకున్న డయాలసిస్ పేషెంట్ శ్రీను గౌడ్ కి బ్రెయిన్ లో బ్లడ్ క్లాట్ అవ్వగా ఒవైసీ హాస్పిటల్ చేర్పించి చికిత్స చేయించగా 4 లక్షల వరకు ఖర్చు అయ్యింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో నిమ్స్ ఆసుపత్రి కి తరలించారు. అక్కడ ఖాళీ బెడ్ లు లేకపోవడంతో ఉస్మానియాకు తరలించగా అక్కడే చికిత్స పొందుతున్నాడు.వీరికి ఒక బాబు సంపేట అరుణ్ (18), అమ్మాయి సంపేట హారిక (18) లు ఉన్నారు.అప్పటికే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటమే కాక పైగా ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో అందిన కాడికి అప్పులు తెచ్చి హాస్పిటల్ లో ఖర్చు పెట్టడం జరిగింది.తల్లి, తండ్రి ఇద్దరు బెడ్ కే పరిమితం కావడంతో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్న ఆ కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న తుర్కయాంజాల్ మున్సిపాలిటీ బీఎస్పీ సీనియర్ నాయకులు వద్దిగల్ల బాబు మున్సిపాలిటీ కమిటీ సభ్యులతో కలసి వారిని పరామర్శించి కొంత ఆర్థిక సహాయం చేయడం జరిగింది.అదే విధంగా మానవత దృక్పథంతో ప్రతి ఒక్కరు తోచిన సహాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలవాలని ఆయన కోరారు.కుటుంబ సభ్యుల ఫోన్ పే నెంబర్ 7386263355 (సంపేట రేణుక) కి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు,కోహెడ సెక్టార్ అధ్యక్షులు శీలం అంగద్ కుమార్, బుస్సు నాగరాజు ,రాయగిరి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సంపద కాపాడకునే బాధ్యత మనందరిది

**సమాచార హక్కు చట్టం మాజీ కమీషనర్ దిలీప్‌రెడ్డి**



కందుకూరు, మేజర్‌న్యూస్(సెప్టెంబర్ 16): ప్రకృతి సంపదన కాపాడకును బాధ్యత మనందరిపై ఉందని సమాచార హక్కు చట్టం మాజీ కమీషనర్ దిలీప్‌రెడ్డి కోరారు. మంగళవారం యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మీర్‌ఖాన్‌పేట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఔషధ మొక్కల తోట ఇంకుడు గుంత,కంపోస్ట్ పిట్, కిచెన్‌గార్డెన్ మొక్కలు నాటే కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ..పాఠశాల ఆవరణలో ఉన్న చింతచెట్టును వర్ణిస్తూ తల్లీ వృక్షంగా ప్రకటించి అనతంరం విద్యార్థులను ఉద్దేశించి ప్రకృతి సంపాద న కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. వాతావరణ కాలుష్యం కారణంగా భూగ్రహం నివాస యోగ్యంగా లేదని దాని సంరక్షణకు ఎర్త్ లీడర్స్ విద్యార్థి దశ నుండి పర్యావరణ స్పృహకలిగి ఉండాలని అందుకు అందుకు తోడుగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మెంటర్ టీచర్ రామ్‌మోహన్‌రావు, ఉపాధ్యాయులు ఎర్త్ లీడర్స్ భానుశ్రీ, సింధుప్రియ కావ్య, ప్రభాస్, యుసూఫ్, మురళీ, నవదీప్, వరుణ్, విద్యార్థులు, యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం రంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ రజనీకాంత్, రాఘవేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

# కాళ్లు మొక్కినా కనికరించలేదు...

**మొదటిపేజీ తరువాయి...** ఆటో నడిపించుకుంటూ, కూలి పని చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం.మా ఇంటిని కూల్చొదంటూ బాధితురాలు ఐశ్రత్ బేగం,మొహమ్మద్ గౌస్ ల కుమారుడు షానవాజ్ చస్తామంటూ పెట్రోల్ పోసుకొని ఇల్లు కూల్చవద్దని అధికారులను వేడుకున్నారు.స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేశ్, కరీం లు మావద్ద రూ. 3లక్షలు డిమాండ్ చేశారని మాకు అంత స్తొమత లేదని కాళ్ళు పట్టుకున్న కనికరించలేదని బాధితులు ఆరోపించారు. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వలేదన్న కారణంగానే మాపై కక్షపూరితంగా తప్పుడు సమాచారం ఇచ్చి మేడిపల్లి మండల రెవిన్యూ అధికారులను ఉసిగొల్పి నిల్వ నీడ లేకుండా చేయడం దుర్మార్గమని వాపోయారు. పేదవారిపైనే మీ ప్రతాపమా అంటూ తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

# కుల మతాలకతీతంగా సాయుధ రైతాంగ పోరాటం...

**రైతులకు అండగా కమ్యూనిస్టులు ముందున్నారు, సాయుధ పోరాటాన్ని నడిపారు, ప్రాణాలు అర్పించారు- సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ**

యాచారం, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16 ): భూసాముల, జమీందారుల, జాగిర్దారుల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలకు కమ్యూనిస్టులు అండగా ఉండి పోరాటాన్ని సాగించి ప్రాణాలర్పించారని సిపిఎం మండల పార్టీ కార్యదర్శి ఆలంపల్లి నరసింహ అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, అమరజీవి కామ్రేడ్ బొడ్డులాలు నాయక్ కు, తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను స్మరించుకుంటూ ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఎం మండల పార్టీ కార్యదర్శి ఆలంపల్లి నరసింహ మాట్లాడుతూ... భూమికోసం, భుక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో రైతాంగానికి అండగా ఉండి, రజాకార్లకు, పెత్తం దారులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి వారిని కట్టడి చేశారని, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కమ్యూనిస్టులు భూస్వాములు చేసే ఆకృత్యాలను నిలిపివేయడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దున్నేవాడిదే భూమి, వెట్టిచాకిరి విముక్తి




అనే నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించి, బానిస సంకెళ్ల విముక్తి కోసం ఎంతోమంది కమ్యూనిస్టు యోధులు ప్రాణాలను కోల్పోయారని అన్నారు. ఎర్ర జెండాలు భూస్వాముల భూముల్లో పాతి, దున్నేవాడిదే భూమి అని రైతులకు భూములు ఇప్పించి, భూస్వాముల గుండెల్లో గుబులు పుట్టించి రైతులను భూహక్కుదారులుగా చేసిన ఘనత ఎర్రజెండా పార్టీకి దక్కుతుందన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ, ముస్లింల ప్రజల మధ్యన జరిగిన మత ఘర్షణగా చిత్రీకరించడానికి మతోన్మాద పార్టీ ప్రయత్నిస్తుందని, చరిత్రనే వక్రీకరిస్తుందని విమర్శించినారు. ఆనాడు ప్రజలను పీడించిన వారే, నేడు గొప్పవారుగా ప్రకటించుకుంటున్నారని, చరిత్రను ఎవరూ మార్చలేరని, సాయుధ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తితో మనువాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ చందు నాయక్, సిపిఎం పార్టీ మండల నాయకుడు, మాజీ ఎంపీటీసీ కే తావు నాయక్, కందుల శ్రీ రాములు, పార్టీ నాయకులు కర్నాటి పెద్దయ్య, కే.కుమార్, పంతు నాయక్, ఎస్ రవి, ఎస్ గోపాల్ , దశరథ, లక్ష్మయ్య, లాలు, గ్రామపంచాయతీ కార్మికులు గ్యార లక్ష్మయ్య, కవిత ,మణెమ్మ, అశ్విని, యాదయ్య, మారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల్లో పోషణ్ బీ..పడాయి బీ

**షాద్‌నగర్ సిడిపివో ఉదయ**



షాద్‌నగర్, మేజర్‌న్యూస్ (సెప్టెంబరు 16): అంగన్‌వాడీల్లో పోషణతో పాటు చదువు కూడా ఉంటుందని, పోషణ్‌బీ..పడాయిబీ పథకం గురించి అంగన్ వాడీ టీచర్లకు కార్యకర్తలకు అవగాహన కలిగి ఉండాని సిడిపివో ఉదయ తెలిపారు. బుదవారం షాద్‌నగర్ పట్టణంలో పోషణ్‌బీ, పడాయిబీ పథకకం గురించి అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల సంరక్షణ, విద్య వంటి అంశాలపై టీచర్లకు వివరించారు.ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు బాల్య సంరక్షణ, విద్య, పోషకాహార సేవలను అందించడంలో నైపుణ్యాల పెంపుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దీంతో పాటు మానసిక, శారీరక వికలాంగత్వం కలిగిన పిల్లలను గుర్తించే అంశం శిక్షణలో ప్రధానం అన్నారు. మూడు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు విజయలక్ష్మి, సంధ్య, రేవతి, లక్ష్మిబాయి, దివ్య, జోత్స్న, వెంకటమ్మ, గీత, పద్మ, జయ, శివరాణి,సమంత, అండాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# దేవుళ్ల పేరుతో బెదిరించి బలవంతపు వసూళ్లు

- శామీర్పేట్ పోలీసులు అప్రమత్తం
- నలుగురిని అరెస్ట్

**శామీర్పేట్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్, 16):**
"దేవుళ్ల పేరుతో" బెదిరించి చందాలు వసూలు చేస్తున్న నలుగురిని శామీర్పేట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తుమ్మంటలో జరిగిన ఈ ఘటన స్థానికులను ఒక్కసారిగా కుదిపేసింది. చంద్రారెడ్డి కాలనీలో నివసించే శివ సాయి నారాయణ ఇంటికి మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు నలుగురు వ్యక్తులు వెళ్లి, ఆయన చేతికి దారం కట్టి, పేరు పుస్తకంలో నమోదు చేశారు. తరువాత "దుర్గామాత విగ్రహ ప్రతిష్ట కోసం రూ.20,000 చందా ఇవ్వాలి" అంటూ డిమాండ్ చేశారు. డబ్బుల్లేవని చెప్పగానే "దారం కట్టుకున్నావు, తప్పనిసరిగా ఇవ్వాలి, లేకపోతే వదలము" అంటూ బెదిరించారు. చివరికి బలవంతంగా ఫోన్‌పే ద్వారా రూ.500 వసూలు చేశారు. ఇంతటితో ఆగకుండా, అదే నలుగురు మరో వ్యక్తి వద్ద రూ.2,000 డిమాండ్ చేసి వసూలు చేసినట్లు బయటపడింది. విచారణలో వీరంతా తూముకుంట కు చెందినవారు కాదని, బిబినగర్ ప్రాంతానికి చెందినవారని తెలిసింది. అంతేకాకుండా ఎటువంటి విగ్రహ ప్రతిష్ట పనులు జరగడం లేదని పోలీసులు స్పష్టం చేశారు.
అరెస్ట్ అయినవారి పేర్లు నాగరాజు, శ్రీనాథ్, లక్ష్మణ్, రాజు. వీరి వద్ద నుంచి పోలీసులు 4 సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు, దారం బిండాలను స్వాధీనం చేసుకున్నారు.
శామీర్పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ – "ఎవరైనా దేవుళ్ల పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఇటువంటి వసూళ్లు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.



# పట్టాపాస్‌బుక్ ఆధార్ కార్డు ఉంటేనే యూరియ పంపిణి

– ఎఫ్ఎస్‌సీఎస్ మేనేజర్ మురళీగౌడ్

పెద్దేముల్,మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):
పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం ద్వార రైతులకు పంపిణి చేస్తున్న యూరియకు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు తప్పకుండా ఉంటేనే రైతులకు యూరియ అందచేయడం జరుగుతుందని రైతు సేవా సహకార సంఘం మేనేజర్ మురళీగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియచేశారు. జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం ఆదేశాల మేరకు ఈ విషయాన్ని తెలియచేయడం జరుగుతుందన్నారు. గతంలో ఆధార్‌కార్డు ఆధారంగా ఎరువులు అందచేయగా, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డులు తప్పకుండా ఉండాలన్నారు. ప్రభుత్వం పంపిణి చేసిన యూరియను ప్రతి రైతుకు అందచేయాలన్న ఉద్దేశం తో ప్రతి రైతుకు ఒకటి, రెండు బస్తాలు అందచేయడం జరుగుతుందన్నారు. ప్రారంభంలో రైతులు ఎవరు రాక ప్రతి రైతుకు నాలుగు నుండి ఐదు బస్తాల వరకు కూడ అందచేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం తక్కువ కోట పంపడంతో ఎరువుల సమస్య అధికంగా అయిందన్నారు.



# నేడు ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్

**కుల్కచర్ల మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్**

వికారాబాద్ డెస్క్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16): నేటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళల కోసం నిర్వహించే స్వస్త్ నారీ స్వశక్తి ఆరోగ్య శిబిరాన్ని కుల్కచర్ల మండల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా కుల్కచర్ల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్త్రీలకు సంబంధించిన వ్యాధులతో పాటు చెవి, ముక్కు గొంతు సంబంధిత సమస్యలతో బాధపడేవారికి గైనకాలజిస్ట్, ఈ.ఎన్.టి వైద్యులచే ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మత్తు పనులు..





రోడ్డు మరమ్మత్తులు చేస్తున్న యువకులు.

**వికారాబాద్ డెస్క్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):**
కుల్కచర్ల మండల పరిధిలోని హన్మ్య నాయక్ తండాలో గ్రామస్తులంతా స్వచ్ఛందంగా డబ్బులు పోగుచేసుకొని చెల్లాపూర్ నుండి హన్మ్య నాయక్ తండాకు వెళ్ళే రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు.
చాలా రోజులుగా కొద్దిపాటి వర్షాలకే రోడ్డుపై నీళ్లు నిలిచిపోయి వాహనాల రాకా పోకలకు ఇబ్బంది కలిగేది. దీంతో వారు స్వచ్ఛందగా కలిపి జెసిపి సహాయం రోడ్డు మరమ్మతు పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...
ప్రభుత్వం ద్వారా రోడ్డు మంజూరైనప్పటికిని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ద్వారా రోడ్డు పనులు నిలిచి పోయాయని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు ప్రభు, రాజేష్, హీరు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పులుమద్ది, లింగంపల్లి గ్రామాల్లో పర్యటించిన ఉత్తరప్రదేశ్ బృందం...



**వికారాబాద్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16) :** చేవెళ్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కాలే యాదయ్య నవాబుపేట్ మండలం లింగంపల్లి గ్రామంలో నిర్వహించిన ఉపాధి హామీ సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం కింద అత్యధిక పనులు కల్పించిన గ్రామంగా లింగంపల్లి ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే కాలే యాదయ్య వారికి శాలువా వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. అంతకు ముందు ఆ బృందం వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామంలో పర్యటించి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, గ్రామపంచాయతీని పరిశీలించి వివరాలు స్థానిక అధికారులకుఅడిగి తెలుసుకున్నారు.

## పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్న సీఎం రిలీఫ్ పండ్ నిధులు...

- ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వచీఫ్ విఫ్ మహేందర్ రెడ్డి వెల్లడి



**తాండూరు ,మేజర్ న్యూస్(సెప్టెంబర్ 17):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేయూత అందిస్తున్న సీఎం రిలీఫ్ పండ్ నిధులు పేద ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయి అని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు టౌన్‌తో పాటు పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామానికి చెందిన షాద్ అలీ, చంద్ బీల కుటుంబాలకు మంగళవారం నాడు హైదరాబాద్ నగరంలోని పట్నం నివాసంలో సీఎం రిలీఫ్ పండ్ చెక్ లను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడు తూ.... పేద ప్రజలు అనారోగ్యానికి గురై నప్పుడు పెద్ద పెద్ద అస్పత్రులల్లో చికిత్స లు పొందడానికి ప్రభుత్వం నిధులు అందిస్తుంది అని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి అని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## దివంగత కేశేపల్లి రాములు మాదిగ ప్రథమ వర్ధంతి

### హాజరై నివాళులర్పించిన పి ఆనంద్ మాదిగ



**వికారాబాద్, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16):** ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసి అసువులు బాసిన కేశపల్లి రాములు ఎమ్మార్పీఎస్ మాజీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పోయిన సంవత్సరం అనారోగ్య కారణాలచే మృతి చెందడం జరిగిందని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. ఆనంద్‌మాదిగ తెలిపారు. మంగళవారం వారి స్వగ్రామమైన గోధుమ గూడాలో వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయనతో పాటు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి శ్రేణులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పి మహిళా విభాగం అధ్యక్షురాలు అన్నపూర్ణ, ఎమ్మార్పీఎస్ వికారాబాద్ మండలం ఇన్చార్జి శ్రీనివాస్, స్థానికులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గోసలు పట్టించుకునే నాథుడే లేడు

## బీఆర్ఎస్ నాయకుల మండిపాటు



కందుకూరు, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల గోసలు పట్టించుకునే నాథుడు కరువయ్యారని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురసాని సురేందర్ రెడ్డి, గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డిలు తెలిపారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశానుసారం మంగళవారం మండలంలోని ధన్నారం, చిప్పలపల్లి గ్రామాలలో మండల పార్టీ అధ్యక్షులు మన్నే జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడుతూ... స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని, ఏ ఎన్నికైనా సవాలుగా స్వీకరించి మెజార్టీ స్థానాలు దక్కించుకోవాలని చూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని నేటి వరకు ఊసే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన పరిహారం చెల్లించడానికి సిద్దంగా ఉన్నారని పేర్కొన్నారు.

★సొసైటీ చైర్మన్‌ను ఉద్దేశ్యపూర్వకంగా తొలగించారని అన ధికార కొత్త జీవోలతో కొత్త వ్యక్తులను నియమించడం కాంగ్రెస్ ప్రభుత్వ హేయమైన చర్య అని నాయకులు తీవ్రంగా విమర్శించారు.

కార్యక్రమంలో జిల్లా సహకారం బ్యాంక్ డైరెక్టర్ పొట్టి ఆనంద్, ఉపాధ్యాక్షులు ఆనేగౌని దామోదర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుక మేఘనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణారెడ్డి, ఇందిరమ్మదశరథ, జ్యోతి చంద్రశేఖర్, గోపాల్‌రెడ్డి, జంగయ్య, పరంజ్యోతి, శ్రీనివాస్, నాయకులు లచ్చునాయక్, మాజీ ఎంపీటీసీలు సురసాని రాజశేఖర్‌రెడ్డి,లలితకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిట్టల పాండు, మాజీ డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, పారిజాతం,మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరదేవేందర్, అనుబంధ సంఘాల అధ్యక్షులు గుయ్యని సామయ్య, తాళ్ల కార్తిక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, ఎండి అలీ, నాయయకలు పిట్టల మల్లేష్, సంజీవరెడ్డి, గుల్వి జైపాల్, పాపగల్ల వెంకటేష్, బాల్‌రాజ్,రమేష్, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఇంగ్లీష్‌పై పట్టును పెంచాలి : విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య




కొందుర్గు, మేజర్‌న్యూస్(సెప్టెంబర్ 16): విద్యార్థుల్లో ఇంగ్లీష్‌పై పట్టును పెంచాలని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ప్రహరి గోడను కొత్తగా నిర్మాణం చేయాలని, పాఠశాలలో ఇటీవల వర్షాలకు కురుస్తున్న తరగతి గదులను పరిశీలించారు. వాటికి వెంటనే మరమత్తులు చేయాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకోసం ప్రతి నెలలో ఒక రోజు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పాఠశాల ఆవరణలో నిర్మాణం జరుగుతున్న మరుగుదొడ్లను తొందరగా నిర్మాణం చేయించాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని, భవిష్యత్తులో ఇంగ్లీష్ అవసరం గురించి విద్యార్థులకు వివరించారు. డిజిటల్ విద్య గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అడిషనల్ డైరెక్టర్ వెంట మండల విద్యాశాఖాధికారిణి గాయత్రిదేవి, ఇంఛార్జి ప్రధానోపాధ్యాయులు వీరేశం, ఉపాధ్యాయులు నాజర్ అలీ ఉన్నారు.




# ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం




మహేశ్వరం,మేజర్ న్యూస్ (సెప్టెంబరు 16) : ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరంలో ప్రిన్సిపల్ డాక్టర్ సంగి రమేశ్ అధ్యక్షతన రసాయన శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ, ఎకో క్లబ్ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంగి రమేశ్ మాట్లాడుతూ.. భూమండలాన్ని సూర్యుని నుండి వచ్చే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుండి రక్షించే ఓజోన్ పొర ప్రాముఖ్యతను ఈ రోజు మనకు గుర్తు చేస్తుందనీ, మాంట్రియల్ ప్రోటోకాల్– 1987 మరియు దాని ప్రాముఖ్యతను వివరిస్తూ, ఈ హానికరమైన పదార్థాలను నియంత్రించడానికి, ప్రపంచదేశాలన్నీ 1987 సెప్టెంబర్ 16న, ఓజోన్ పొరను క్షీణింపజేసే పదార్థాలను నియంత్రించే విధంగా ప్రపంచ దేశాలు మాంట్రియల్ ప్రోటోకాల్‌పై సంతకం చేశాయి. దీనికి గుర్తుగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని జరుపుకుంటామని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ మాట్లాడుతూ మన భూమిని, మన భవిష్యత్తును కాపాడుకోవడానికి ఓజోన్ పొరను పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. ఓజోన్‌ను రక్షించడానికి మన బాధ్యతగా పర్యావరణ అనుకూల పద్ధతులను పాటించాలనీ , దానికై సిఎఫ్‌సి,హెచ్‌ఎఫ్‌సిలు లేని ఉత్పత్తులను వాడాలనీ, మొక్కలు నాటడం వలన చెట్లు మన వాతావరణాన్ని శుభ్రపరుస్తాయనీ, ఓజోన్ పొర పరిరక్షణకు పరోక్షంగా సహాయపడతాయని అన్నారు. ఒక పునరంకితం చేసుకునే రోజుగా భావించి, మనవంతు కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. అనంతరం జాతీయ సేవా పథకంఎన్ఎస్ఎస్ విభాగ అధికారిణి డాక్టర్ జాహెదబేగం ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేసి, విద్యార్థులు పోస్టర్ల ద్వార అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్. ఉపేందర్,ఎకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీహరి రెడ్డి , ఎసిఒ శ్రీదేవి నరేందర్ రెడ్డి, డాక్టర్ చెన్నోజి , డాక్టర్ ఫర్ హత్ నాజ్నీన్, డాక్టర్ గోపాల్, కుమార్, యం సునీత, రవళిక మరియు అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసుకోవాలి : ఏవో శ్రీనివాస్ గౌడ్



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16) : ఆమనగల్లు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు మంగళవారం ఆయన స్థానిక విలేకరుల తో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. గ్రామానికి వచ్చే క్లస్టర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో రైతులు పంటల నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. సీసీఐలో పత్తి అమ్మకాలు జరపాలంటే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయని, అదేవిధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన పంటల నమోదు ప్రకారం ఉంటాయి కాబట్టి రైతులు విధిగా పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని మేడిగడ్డ తండాలో వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారి గాయత్రి తో కలిసి పంటల నమోదు కార్యక్రమం చేపట్టారు.

# యూరియా కోసం ఆందోళన వద్దు

## జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా



మంచాల, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16) : రైతులు ఏవరూ యూరియా కోసం ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘంలో నిల్వ ఉన్న ఎరువులను ఈపాస్ మెషిన్‌తో సరి చూసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియా సరఫరాపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యూరియా నిరంతర సరఫరా ఉంటుందని ఆమె అన్నారు. రైతులు అధిక మొత్తంలో యూరియా నిల్వ చేయాల్సిన అవసరం లేదని, అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలని సూచించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా రైతులందరూ నానో యూరియాను వాడాలని తెలియజేశారు. నానో యూరియా వాడకంలో సాగు ఖర్చు తగ్గించవచ్చు అని తెలిపారు. ధర బాటిల్ రూ. 225 ఉంటుందని, అర లీటర్ (500 మి.లీ) ఎకరానికి సరిపోతుందని అన్నారు. ఒక లీటర్ నీటిలో 4 ఎంఎల్ నానో యూరియాను కలిపి స్ప్రే చేయాలి. డ్రోన్ ద్వారా వినియోగిస్తే 10 లీటర్ల సామర్థ్యం ఉంటే 500 ఎంఎల్ సరిపోతుందని చెప్పారు. పంట వేసిన తర్వాత పిలకలు వచ్చే దశ నుంచి నానో యూరియా స్ప్రే చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ వెదిరే హన్మంత్ రెడ్డి, డైరెక్టర్ జనిగే వెంకటేష్, మండల వ్యవసాయ అధికారి ఎ శ్రీలత, వ్యవసాయ అధికారి హరినాథ్, ఎఈవోలు లింగస్వామి, పిఏసిఎస్ సిబ్బంది లింగం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## రైతన్నలకు తప్పని యూరియా కష్టాలు- పెరుమాండ్ల రమేష్





యాచారం, మేజర్ న్యూస్ ( సెప్టెంబర్ 16): యూరియా కోసం పంటలాగమైతుంటే, రైతన్నలను పట్టించు కోవడం లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు పెరుమాండ్ల రమేష్ విమర్శించారు. మంగళవారం యాచారంలో మేజర్ న్యూస్ తో మాట్లాడిన రమేష్...గత మూడు వారాలుగా యాచారం మండల రైతులు వ్యయ ప్రయాసలకోడ్చి యూరియా కోసం తంటాలు పడుతున్నారని, పిఎసిఎస్ యాచారం కి యూరియా లోడ్ వచ్చిందని తెలియగానే, తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు కట్టి పడిగాపులు కాస్తున్నారని, అయినా వారికి సరైన న్యాయం జరగట్లేదని అన్నారు. రైతులకు నాలుగు బస్తాల యూరియా అవసరమంటే, ఒక బస్తా యూరియా ఇచ్చి సంబంధిత అధికారులు వారిని వెళ్ళిపొమ్మన్నారని, మరో మూడు బస్తాలకు మళ్లీ లోడ్ వచ్చినప్పుడు రండి అని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలన్నీ నాశనమయ్యాక యూరియా ఇస్తే ఏం చేసుకోవాలని రైతన్నలు దిగాలు చెందుతున్నారన్నారు. ఆవేదనతో రైతన్నలు అధికారులను ప్రశ్నిస్తే పోలీసుల జులూం తప్పడం లేదని, ప్రజలకు అన్నం పెట్టే రైతన్నల పరిస్థితి ఇలా ఉండటం బాధాకరమని, కెసిఆర్ పాలనలో ఏ ఒక్క రైతు రోడ్డు ఎక్కలేదని, రైతుబంధు మొదలుకొని, రుణమాఫీ, రైతు భీమా, యూరియా, అన్నీ పంటలకు అవసరమయ్యే ఎరువులను సకాలంలో అందించి రైతులను రాజుగా నిలబెట్టారని కొనియాడారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసే ఏ ఒక్క పథకం సాఫీగా జరగనివ్వటం లేదని, రైతు కంట కన్నీరు రాష్ట్రానికి ముప్పుగా మారకముందే, రైతన్నలకు కావాల్సిన యూరియాను అందించి వారిని ఆదుకోవాలని, లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ఆగ్రహానికి గురికాక తప్పదని, రైతుల వెంట బిఆర్ఎస్ పార్టీ తోడు ఉందని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

# నేడు బొంరాస్ పేట్ కు రానున్న ప్రభుత్వ చీఫ్ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురువ...

- గొర్ల బాధిత కుటుంబాలను పరామర్శించనున్న బీర్ల ఐలయ్య
- హాజరు కానున్న కురుమ సంఘం రాష్ట్ర నాయకులు
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేయనున్న నేతలు

**బొంరాస్ పేట్, దుద్యల్ మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 17):**

ఇటీవల దురదృష్టవ శాత్తు రోడ్డు ప్రమాదంలో 80 గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కురుమ, కురుమ సంఘం రాష్ట్ర నాయకులు నేడు బొంరాస్ పేట్‌కు రానున్నట్లు మండల కురుమ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం తుంకిమెట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడుతూ....,

గత నెల 28 తారీకున వినాయక చవితి రోజు బీజాపూర్ - హైదరాబాద్ జాతీయ రహదారిలోని బొంరాస్పేట్ పెద్ద చెరువు దగ్గర గుర్తుతెలియని వాహనం ఢీకొని నాందార్ పూర్ గ్రామానికి చెందిన కురువ మల్కప్ప, కురువ రాయి కంటి ఎల్లప్ప ఇద్దరివి రోడ్డు ప్రమాదంలో 80 గొర్రెలు మృతి చెందిన ఘటన తెలిసిందే. ఇట్టి దురదృష్ట ఘటన తెలుసుకున్న రాష్ట్ర నాయకులు కురువ కుల ముద్దుబిడ్డ ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య,రాష్ట్ర కురువ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం, షఫర్డ్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు,బురుగడ్డ పుష్ప నాగేష్, రాష్ట్ర కురువ సంఘం జనరల్ సెక్రెటరీ



బండారు నారాయణ, వైస్ ప్రెసిడెంట్ సదానందం, మాజీ అడిషనల్ ఎస్పీ, సంగం రాష్ట్ర సెక్రెటరీ నరసింహ, రాష్ట్ర యువత అధ్యక్షుడు తూముకుంట అరుణ్ కుమార్ తదిత ప్రముఖులు బాధితుల కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం చేస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కుల నాయకులు, అలాగే జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కుల నాయకులు అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘ నాయకులు కురువ శ్రీశైలం, విశ్వనాథ్ పల్లి గోపాల్, విశ్వనాథ్ పల్లి మల్లేష్, జనగామ బాలప్ప, చిట్లపల్లి మల్లప్ప, రాజు, మాజీ ఉపసర్పంచ్ పండ్ల శేఖర్, నాగప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

# పక్రృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం

- తాండూరు ఫారెస్టు సెక్షన్ అధికారి మమత
- కందనెల్లి పాఠశాలల్లో ఘనంగా వరల్డ్ ఓజోన్ డే

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):**

పకృతిని కాపాడుతేనే భవిష్యత్తు సురక్షితం అని తాండూరు ఫారెస్టు సెక్షన్ అధికారి మమత అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల కందనెల్లి ఉన్నత పాఠశాలల్లో వరల్డ్ ఓజోన్ డే సందర్భంగా మొలక బాలల మాస పత్రిక అధ్వర్యంలో ప్రత్యేక అవగాహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వరల్డ్ ఓజోన్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా ఫారెస్టు ఆఫీసర్ మమత పాల్గోన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మమత మాట్లాడుతూ ఓజోన్ ఫొర భూమి జీవాలకు కవచం అన్నారు.పర్యావరణాన్ని కాపాడటం మన అందరి ప్రధాన కర్తవ్యం అని విద్యార్థులు అలవాటు చేసుకోవాలని సూచించారు. మొలక స్పేషల్ కారస్పాండెంట్ కేవీఎం. వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓ మొక్కను నాటడం ద్వార భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణం అందిచవచ్చని పర్యావరణ పై ప్రేమ పెంచుకుంటే జీవ వైవిధ్యం సురక్షితమవుతుందని



పెద్దేముల్ మండల కందనెల్లి పాఠశాలల్లో మాట్లాడుతున్న అటవి శాఖ అధికారి మమత

వివరించారు.అనంతరం విద్యార్థులచే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి , పచ్చధనాన్ని పెంపోదిస్తాము అంటు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు శివకుమార్, ఉపాద్యాయులు సత్యం రమాదేవి,లావణ్య, సంతోష్‌కుమార్, అనురాధ,పీఈటి రాధ,కృష్ణ, శ్రీధర్‌తో పాటు తదితరులు పాల్గోన్నారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞా చేయించారు.

# మహిళల ఆరోగ్యం బాగుంటేనే కుటుంబాలు బలపడతాయి :డాక్టర్ సీ. ఉమా గౌరి

- నేటి నుండి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు
- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో 121 క్యాంపులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):**

"మహిళల ఆరోగ్యం బాగుంటేనే కుటుంబాలు బలపడతాయి. ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రతి మహిళ తప్పకుండా వినియోగించుకోవాలి. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిషోర బాలికలు సమగ్ర వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు పొందాలి" అని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ సీ. ఉమా గౌరి సూచించారు.

"మహిళల ఆరోగ్యం - శక్తివంతమైన కుటుంబాలు" అనే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న "స్వస్థ నారీ - సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమం రాష్ట్రంలో ఆరోగ్యశాఖ సెక్రటరీ మరియు కమిషనర్ (ఆరోగ్య & కుటుంబ సంక్షేమ శాఖ) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీ (నేటి) నుండి అక్టోబర్ 2 వరకు (ప్రభుత్వ సెలవులను మినహాయించి) 12 రోజులు నిర్వహించబడనుందని మంగళవారం ఒక ప్రకటనలో ఆమె పేర్కొన్నారు.

**ఆల్వాల్ పిహెచ్‌సీలో ప్రారంభం:**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక వైద్య శిబిరాలు జిల్లాలోని ఆల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గౌరవ ఆహ్వానితులచే ప్రారంభించబడతాయి.

**జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు:**

జిల్లాలో ఒక ఏరియా హాస్పిటల్, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లలో ఈ కార్యక్రమం



జరుగుతుంది. ప్రతిరోజూ 11 ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించబడతాయి. మొత్తం 121 మెడికల్ క్యాంపులు ద్వారా మహిళలకు వైద్య పరీక్షలు, చికిత్సలు అందించనున్నారు.

**అందించబడే సేవలు:**

ఈ ప్రత్యేక వైద్య శిబిరాల్లో గైనకాలజీ, చిన్నపిల్లల, నేత్ర, దంత, చర్మ, చెవి-ముక్కు-గొంతు, సైకియాట్రీ తదితర నిపుణుల పరీక్షలు నిర్వహించబడతాయి. బీపీ, షుగర్, క్యాన్సర్, టిబి, హిమోగ్లోబిన్ సమస్యలపై పరీక్షలు, సలహాలు ఇవ్వబడతాయి. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు, అవసరమైన మందుల పంపిణీ, కౌన్సిలింగ్, రిఫరల్స్ చేపడతారు.

**పోషణ, కౌన్సిలింగ్ కార్యక్రమాలు:**

పోషణ అభియాన్‌లో భాగంగా రక్తహీనత చికిత్స, పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. బలహీనంగా ఉన్న (సామ్ & మాం) పిల్లలకు చికిత్స అందించి అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తారు. కిషోర బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, మానసిక ఆరోగ్య నిపుణులచే కౌన్సిలింగ్ కూడా నిర్వహించబడుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖలు సహకరిస్తున్నాయి. జిల్లా మహిళలు ఈ ప్రత్యేక వైద్య శిబిరాలను విస్తృతంగా వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

**పెద్దేముల్,మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16) :**

ఆపదల్లో ఉన్న కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అండదండలతో పాటు ఆదుకుంటుందని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండల ఇందూరు గ్రామానికి చెందిన చాంద్ భీ కరోన సమయంలో ఆసుపత్రి పాలై చికిత్స పోందుతు ఆకాల మృతి చెందింది.ఈ నేపథ్యంలో చాంద్ భీ కుమారుడు మహమ్మద్ అలీ చదువులు, ఆసుపత్రి బిల్లులతో చీఫ్ విప్ మహేందర్‌రెడ్డిని సహాయం కోరగా రూ. 60వేల చెక్కును మహమ్మద్ అలీ, సయ్యద్ మసీన్‌లకు హైద్రాబాద్‌లో అందించారు.ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపదల్లో ఉన్న ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగ ఉంటుందన్నారు.

## నాగులపల్లిలో పులి సంచారం..!

- భయాందోళనకు గురవుతున్న పరిసర ప్రాంతాల ప్రజలు

**పెద్దేముల్, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16):** పెద్దేముల్ మండలం నాగులపల్లి గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. మంగళవారం గ్రామ పరిసర ప్రాంతాల్లో అడవి జంతువు సంచరించినట్లు విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు పాద ముద్రలను గుర్తించగా చిరుతపులి పాదాలు అని నిర్ధారణకు వచ్చారు. ఈ సంఘటనతో గ్రామస్తులు భయాంతోళనకు గురవుతున్నారు. జంతు పాద ముద్రలను



జంతు పాద ముంద్రలు

ఎఫ్ఆర్‌ఓ శ్రీదేవి సరస్వతి, ఎఫ్ఎస్‌ఓ స్వప్న, ఎఫ్‌బీఓ నాగసాయి కలిసి గుర్తించారు. నాగుపల్లి అటవి ప్రాంతం నుంచి పులి తాండూరు మండలం జినుగుర్తి అడవి మార్గంలోకి వెళ్లి ఉండవచ్చని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## నేడు హెల్త్ క్యాంప్‌లు ప్రారంభం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. లలితా దేవి

**వికారాబాద్ మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16):** స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా మహిళల ఆరోగ్య పరిరక్షణ కొరకు 104 హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే లలితాదేవి తెలిపారు. నేడు వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో స్పీకర్ చేతుల మీదుగా ఈ క్యాంప్ ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ



క్యాంపులలో చిన్నపిల్లలకు, యుక్త వయసు బాలికలకు, అన్ని వయసు మహిళలకు వారి యొక్క ఆరోగ్య సమస్యల పరిష్కారం కొరకు స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన పరీక్షలు నిర్వహించి స్పెషలిస్ట్ వైద్యుల చేత చికిత్స చేయబడు తుందన్నారు. జిల్లాలోని మహిళలందరూ కూడా వారి యొక్క ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న క్యాంపులలో స్క్రీనింగ్ చేయించుకొని తగు చికిత్స పొందాల్సిందిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ లో నిర్వహించే మెగా వైద్య శిబిరంతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి రోజూ 8 హెల్త్ క్యాంపులు 12 రోజులపాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు.

## రాజకీయ నేతలతో తహసీల్దార్ సమావేశం

**కొడంగల్, మేజర్ న్యూస్ (సెప్టెంబరు 16):** కొడంగల్ తహసీల్దార్ దీపక్ శ్యామ్సున్ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల




నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌లు, వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. రాజకీయ నాయకులు పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌ఏలను నియమించుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అనిత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం : ఎమ్మెల్యే కాలె యాదయ్య






చేవెళ్ల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వామని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని లక్ష్మిరావుగూడలో రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, గుండాల గ్రామంలో రూ.20లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, సాయిరెడ్డిగూడలో రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, అల్లవాడలో రూ.10లక్షలతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, చన్‌వెల్లిలో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, రూ.10లక్షలతో అండర్ డ్రైనేజ్, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, గొల్లపల్లిలో రూ.10లక్షలతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, కుమ్మెరలో రూ.10లక్షలతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్, రావులపల్లిలో రూ.20లక్షలతో సీసీ రోడ్లు,రూ. 5లక్షలతో స్ట్రీట్ లైట్స్, ముడిమ్యాలలో రూ.40లక్షలతో సీసీ రోడ్లు, రూ.5లక్షలతో స్ట్రీట్ లైట్స్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాలను సమస్యలు లేకుండా సంపూర్ణ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజాసమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. చేవెళ్లను రాష్ట్రంలోనే మోడల్ సిటీగా మారుస్తానని హామీ ఇచ్చారు. చేవెళ్ల మండలం, మున్సిపల్, చేవెళ్ల అసెంబ్లీ, పార్లమెంట్ హెడ్ క్వాటర్ పేరుకు తగ్గట్టుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఆహర్నిశలు శ్రమిస్తు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. చేవెళ్ల మండలంలోని వివిధ గ్రామాలకు మొదటి విడతలో రూ.9కోట్ల90లక్షలు వచ్చాయని, మరిన్ని నిధులు తీసుకురానున్నట్లు చెప్పారు. ముడిమ్యాల–మెడిపల్లి రోడ్డుకు రూ.24కోట్లు మంజూరయ్యాయని, వర్షాకాలం తర్వాత బీటీ రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయన్నారు. మహిళలకు రుణాలు ఇచ్చి కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇల్లు లేని పేదలకు ఇండ్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎంతమంది అర్హులున్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని, బిల్లులు కూడా త్వరగా వస్తున్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజాపాలన ఫలాలను అర్హులందరికి అందించడమే లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో హిమాబింధు, ఆర్‌డబ్ల్యూఎస్ గీతాస్రవంతి, పీఆర్ డీఈ గణేష్, చేవెళ్ల, గుండాల సోసైటి చైర్మెన్లు దేవర వెంకట్‌రెడ్డి, నక్క బుచ్చిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ పెంటయ్యగౌడ్, బ్యాగరి రాములు, మాజీ జడ్పీటీసీలు మర్పల్లి మాలతీకృష్ణారెడ్డి, కాలె శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, పడాల రాములు, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌గౌడ్, మహిళా ప్రధానకార్యదర్శి గోనె సరితాప్రతాప్‌రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు మధుసూదన్‌గుప్తా, మాజీ సర్పంచులు కేసారం శ్రీనివాస్, దావల్గారి గోపాల్‌రెడ్డి, లొంక శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, పడాల ప్రభాకర్, రాంరెడ్డి, జహంగీర్, రాంచెంద్రయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీలు గుండాల రాములు, బూర్ల సాయినాథ్,స్వరూప, కిష్టయ్య, మండల యూత్ అధ్యక్షులు కార్తీక్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, నాయకులు గోటూరి బాలయ్య, కావలి బుచ్చయ్య, పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి, బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోటూరి సుదర్శన్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కేసారం రాములు తదితరులు ఉన్నారు.

# ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

▸▸ అవేర్ హాస్పిటల్ చైర్మన్ మాధవన్ జీ ▸▸ సరస్వతిగూడలో ఉచిత వైద్య శిభిరం



కందుకూరు, మేజర్‌న్యూస్( సెప్టెంబర్ 16): గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని అవేర్ హాస్పిటల్ చైర్మన్ మాధవన్‌జీ అన్నారు. మంగళవారం కందుకూరు మండలం సరస్వతిగూడలో మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిభిరం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ ఉచిత వైద్య శిభిరాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...మారుతున్న కాలాన్ని బట్టి ఆహరపు అలవాట్లు అనేక రుగ్మతలు ఏర్పడుతున్నాయన్నారు. తదుపరి అనేక గ్రామాలలో ఉచిత వైద్యశిభిరం ఏర్పాటు చేస్తామని, ఉచిత మంచినీరు,వాటర్ పిల్టర్, నూతన గుడి నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు వైద్య సేవలకు మగ్దులై శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బూసరమోని యాదయ్య, గుల్వి నర్సింహ్మా, గోపిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మకూరి ప్రశాంత్‌కుమార్, కె.రాజిరెడ్డి, కాల్వ శ్రీనివాస్, వెంకన్న, అల్వాల మహేందర్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు కె.పాండురంగారెడ్డి, బి.యాదగిరి, బూసరమోని మల్లేష్,చంద్రయ్య, మాదరమోని యాదయ్య, శ్రీనివాస్,రవీందర్, దేవేందర్, పాల్గొన్నారు.

# నిజాం రాచరిక పాలన రద్దుకై మతం రంగు పూయవద్దు

★సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య




కందుకూరు, మేజర్‌న్యూస్ ( సెప్టెంబర్ 16): నిజాం రాచరిక పాలన రద్దుకై జరిగిన ప్రజా పోరాటానికి మతంరంగు పూయవద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాలలో భాగంగా సీపీఐ పార్టీ మహేశ్వం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టంకరి రామ్‌రెడ్డి పంక్షన్ హాల్లో మండల కార్యదర్శి కొమ్మగళ్ల రాజు ఆధ్వర్యంలో వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఫ్యూడల్ ప్రభువు లాంటి దోపిడి దారులకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ సాయుధ పోరాటం మాతృభాష కోసం, భూమికోసం,భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం జరిగిందన్నారు. మట్టి మనుషులు చేసిన తిరుగుబాటు దిక్కారస్వరం బాంచన్ దొర నీకాల్మొక్త అన్న వ్యక్తి దొర ఏందిరో దొరతనం ఏందిరో అంటూ బంధువులు పట్టిన కమ్యూనిస్టు పోరాటమది అన్నారు. హైద్రాబాద్ సంస్థానం రాజు ముస్లీం అయినప్పటికి జమిందారులు జాగీరు దారురులు, భూస్వాములు దాదాపు 90 శాతం హిందువులే నిజాంకు గులాంలుగా వ్యవహించారన్నారు. నిజాం రాచరిక పాలను రద్దుకై బీజేపీ, ఆర్ ఎస్ఎస్ లు సాయుధ పోరాటంలో ఊసే లేదని దీన్ని ప్రజలు అర్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటిపర్వతాలు,ఏఐటీయుసి రాష్ట్ర సమితి కౌన్సిల్ సభ్యులు బి దత్తునాయక్,జిల్లా కార్యవర్గ సభ్యులు పల్నాటి యాదయ్య,మహేశ్వరం మండల కార్యదర్శి దేవేందర్ గౌడ్,సహాయ కార్యదర్శి బ్రహ్మాచారీ, రవి,అంజి,శివ, రాకేష్, రమేష్, సుగుణమ్మ, దేవమ్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షురాలుగా జయమ్మ



మహేశ్వరం, మేజర్ న్యూస్ (సెప్టెంబరు 16) : మహేశ్వరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షురాలుగా చెన్‌రెడ్డి జయమ్మ పిఎసిఎస్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చాకలి యాదయ్య,నాయకులు కూన యాదయ్య, ఆవుల యాదయ్య, వట్టేల మల్లేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా కబడ్డీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి , ప్రశాంత్‌రెడ్డి, దోమ శ్రీనివాస్ రెడ్డి శివగంగ ఆలయ కమిటీ ఛైర్మన్ అల్లే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గృహిణి అదృశ్యం



జల్ పల్లి, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బాలాపూర్ మండలం, జల్ పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో నివాసం ఉంటున్న పోచన్న నరసింహులు, తన ఇంటి సమీపంలో ఉంటున్న సాగర్ తన కారును నరసింహులు ఇంటికి మధ్య ఉన్న స్థలంలో కార్ పార్కింగ్ చేసేవాడు. ఈ విషయంలో, నరసింహులు భార్య పోచన్న మహేశ్వరి (44)తో సాగర్ కుటుంబ సభ్యులతో తరచుగా గొడవలు జరిగేవి. ఈ విషయంపై నరసింహులు తన భార్యను మందలించగా, ఈనెల 12న అతని భార్య ఇంట్లో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి వెల్లిపోయింది. దీంతో తన భార్య గురించి నరసింహులు చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న బంధువుల వద్ద వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నరసింహులు పహాడీ షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే గతంలో అతని భార్య తనతో గొడవపడి కొన్ని గంటల తర్వాత తిరిగి వచ్చేదని ఫిర్యాదులు పేర్కొన్నాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడు దూగుంట్ల శ్రీధర్‌కు ఘనంగా సన్మానం






తుర్కయంజాల్, మేజర్ న్యూస్,( సెప్టెంబర్ 16) : బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు తీసుకున్న దూగుంట్ల శ్రీధర్ ను రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో ముందుండి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. భవిష్యత్ లో వివిధ కోర్టులలో ప్రభుత్వ పదవుల నియమకలలో న్యాయపరమైన వాటా కోసం పోరాటానికి ప్రతి ఒక్కరు సిద్ధం కావాలన్నారు. యువ న్యాయవాదులకి ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 5000/- స్టైఫండ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో జిల్లా కమిటీలు వేస్తామని,యువ న్యాయవాధులు ప్రతి ఒక్కరు ముందుండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామనర్సింహ గౌడ్, మల్లేష్,,సమీర్ అనురాగ్,రాకేష్,గంగపురం రాజు, మురళి,రాంసింగ్ నాయక్, మీనాక్షి, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

### నేడే ప్రజా పాలన దినోత్సవం మండల పరిషత్ కార్యాలయంలో జండా ఆవిష్కరణ

జిల్లేడు– చౌదరి గూడెం: మేజర్ న్యూస్:( సెప్టెంబరు:16): రాష్ట్ర ప్రభుత్వ ము ఆదేశానుసారం ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా నేడు 8: 40 నిమిషాలకు జాతీయ జండా అవిస్కర్ణ ఉంటుందని ఎం డీ ఓ. ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు కార్యకర్తలు, మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొ నీ విజయవంతం చేయాలని ఎం పి డి ఓ. ప్రవీణ్ కుమార్ కోరారు.

# ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవం



కందుకూరు, మేజర్ న్యూస్ (సెప్టెం బర్ 16): ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కందుకూరు మండల ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు అందించారు. మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీడీవో సరిత ఆధ్వర్యంలో మండల విద్యాధికారి నర్సింహా అధ్యక్షతన మండలంలోని 49 మంది ఉపాధ్యాయులకు అవార్డులు అందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య,రాములు, విష్ణుప్రియ, భార్గవి, మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోవర్ధన్ యాదవ్, గోపాల్ నాయక్, రమేష్, సత్యనారాయణ రెడ్డి,దేవేందర్ నాయక్, రవి,బుగ్గరాములు, రాజు గౌడ్,రాజశేఖర్,వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యతోనే మెరుగైన సమాజం నిర్మాణం

- పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి
- పాఠశాల అభివృద్ధికి మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి సొంత నిధులతో ముందడుగు
- అన్నోజిగూడ జెడ్పీ హైస్కూల్‌లో మరుగుదొడ్ల మరమ్మత్తులు, సీసీ కెమెరాలు ఏర్పాటు



**ఘట్‌కేసర్ రూరల్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16)**: అన్ని వర్గాలకు నాణ్యమైన విద్య అందినప్పుడే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమైతుందని పోచారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తన సొంత నిధులు దాదాపు రూ.90 వేలతో మరుగుదొడ్ల మరమ్మత్తులు, ప్రహరి గొడ ఎత్తు పెంపుతో పాటు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 8 సిసి కెమెరాలను మంగళవారం ఘట్‌కేసర్ సహకార సంఘం మాజీ డైరెక్టర్ బోయపల్లి సత్తిరెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు, నాయకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలునిచ్చారు. గుడులకు కాకుండా బడులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరినిపై ఉందని, అప్పుడే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమైతుందని అన్నారు. ఉపాధ్యాయులు తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించి విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములు కావాలని, పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.ప్రతాప్ రెడ్డి, నాయకులు జితేందర్ నాయక్, కె.ఎం.రెడ్డి, బోయవల్లి రాజేశ్వర్ రెడ్డి, పాషం లక్ష్మణ్ యాదవ్, అర్జున్ రెడ్డి, తిలక్ నాయక్, మహిందర్ నాయక్, రఘురాంరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఇసుక రాఘవేందర్ రెడ్డి, సంతోష్ నాయక్, కొమ్ముల ప్రశాంత్, ప్రణత్, శాండీ, ఉపాధ్యాయులు రాందాస్ గౌడ్, కవిత, అనురాధ, భవాని, భాషయ్య, అమరేశ్వరీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- కనీసవేతనలు పెంచి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. అనసూయ వెల్లడి



**తాండూరు, మేజర్ న్యూస్(సెప్టెంబర్ 16):** అంగన్వాడీలు ఎదుర్కొంటున్న అనేక సమస్య లను వెంటనే పరిస్కారం చేసి, అంగన్వాడీ కార్మికులను ప్రభుత్వఉద్యోగులుగా గుర్తించి, కనీసవేతనాలు ఇరవై ఐదు వేలకు పెంచాలి అని అంగన్వాడీ లు డిమాండ్ చేశారు. రాష్ట్ర అంగన్వాడీ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి. అనసూయ ఆధ్వర్యంలో మంగళవారం నాడు తాండూరు లోని ప్రాజెక్ట్ డైరెక్టర్ (సీడీపీఓ )కు పలు సమస్య లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అంగన్వాడీ లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు పెంచాలి అని పేర్కొన్నారు. 45,46వ ఇండియన్ కన్ఫరెన్స్ (ఐసీఎల్ )సిఫారస్సు లను అమలు చేయాలి అని అన్నారు. స్కీమ్ వర్కర్లకు కార్మికుల హోదా కల్పించి, సామాజిక భద్రత కల్పించాలి అని అన్నారు. రిటైడ్ మెంట్ బెనిఫిట్స్ పది లక్షలుఇచ్చి, ప్రమాద వశత్తు మరణించిన కుటుంబాల కు కూడా పది లక్షలు ఇవ్వాలి అని పేర్కొన్నారు. నూతన విద్యా విధానం-2020 లో భాగంగా అంగన్వాడీ టీచర్లను ప్రీ ప్రైమరీ టీచర్లుగా నియమించాలి.

హెల్పర్లను చైల్డ్ కేర్ టేకర్ గా గుర్తించి పదోన్నతి కల్పించాలి. అంగన్వాడి టీచర్ను సూపర్ వైజర్గా, హెల్పర్లకు టీచర్గా పదోన్నతి కల్పించాలి. వయోపరిమితి తొలగించాలి.

అంగన్వాడి టీచర్లకు ప్రభుత్వ సెలవులు, గ్యాజువల్ లీవ్స్, మెడికల్ లీవ్స్ సౌకర్యం కల్పించాలి.

ప్రతినెల 1 నుండి 6వ తేదీలోపు జీతాలు ఇవ్వాలి.

అతి త్వరలోనే టీచర్, ఆయాల పోస్ట్ భర్తీ చయాలి.

ప్రభుత్వ స్కూలు ఉద్యోగులతో పాటు అంగన్వాడి టీచర్లు, ఆయాలకు కూడా సెలవులు ఇవ్వాలి.

వినతి పత్రం ఇచ్చిన వారిలో అనసూయతో పాటు వసంత మాల, ఇందిరా, సంఘీత, అంజిలమ్మ, బి. బాలమణి, తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి...

## కరణం యూసుఫ్



మోమిన్ పేట్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్16): మోమిన్ పేటలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కరణం యూసుఫ్ మంగళవారం పంచాయతీ కార్యదర్శి స్వప్నకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామంలోని అన్ని వార్డుల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలి, అలాగే రోడ్లు అన్ని గుంతల మయం కావడంతో, కాలనీవాసులు ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలో వాహనదారులు గుంతల వల్ల అనేక సందర్భాల్లో కింద పడాల్సి ఉన్న పరిస్థితులు వచ్చాయన్నారు. కాలనీలో కుక్కల బెడద ఎక్కువ కావడం వల్ల కాలనీ ప్రజలు భయంభ్రాంతులకు గురవుతున్నారు. అలాగే కుక్క కాటు వల్ల రేబిస్ వ్యాధి వస్తుందనే భయంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నార న్నారు. కొన్ని సందర్భాల్లో



వాహనాలను సైతం వెంబడించి కుక్కకాటుకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఈ విషయమై గతంలో ఎంపీడీవోకు, వినతి పత్రం సమర్పించామని, అయినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైనాయన్నారు. సంబంధిత శాఖ అధికారులు సమస్యలను పరిష్కరించి కుక్కల బెడదను నివారించాలని, అలాగే గుంతల మయమైన రోడ్ల వల్ల పాఠశాలకు వెళ్లే విద్యార్థులు గ్రామ ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారు వాపోయారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హాజీ, తదితరులు ఉన్నారు.

### అంకితభావంతో పనిచేసిన

# ఉపాధ్యాయులకు గుర్తింపు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు రమేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం.

**వికారాబాద్ డెస్క్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):** అంకితభావంతో విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషిచేసిన ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని ప్రధానో పాధ్యాయుడు జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముజాహిద్ పూర్‌లో ఏర్పాటుచేసిన కాంప్లెక్స్ సమావేశంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా బహుమతి పొందిన ఉప్పరి రమేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి ఏదో ఒక సమయంలో సరైన గుర్తింపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్పి రాజు తదితరులు పాల్గొన్నారు.

# భర్త వేధింపులతో వివాహిత ఆత్మహత్య...



**వికారాబాద్ డెస్క్,మేజర్ న్యూస్(సెప్టెంబర్ 16):** మండలం పరిధిలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన వడ్డే రాములమ్మ భర్త వెంకటప్ప ఇచ్చిన ఫిర్యాదు తన కూతురు అయినా వడ్డే సావిత్రిని 16 సంవత్సరాల క్రితం అక్కంపల్లికి చెందిన మల్లేష్ కు ఇచ్చి వివాహం చేశారు,వివాహమైన రెండు మూడు సంవత్సరాలు మంచిగానే జీవించినారు ఆ తర్వాత మల్లేష్ తాగుడుకు అలవాటు ప డి భార్యను కొట్టడం తిట్టడం వేధించడం చేయగా బాధలు భరించలేక దానితోపాటు ఆడపడుచు లైనటువంటి పెంటమ్మ,అంజమ్మలు కూడా వేధించడంతో భర్త మల్లేష్ బాగా కొట్టడంతో పురుగుల మందుతాగి వికారాబాద్ లోని మిషన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించగా తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లేష్ పై ఆడపడుచుల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు.

### డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ

# ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం




ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బీ.శ్రీనివాస్‌రెడ్డి

**కొడంగల్, మేజర్‌న్యూస్ (సెప్టెంబరు 16):** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ బీ.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర అనేది అన్నీ జీవులను రక్షించే సహజ కవచం అన్నారు. ఇది సూర్యడి హానికరమైన యువీ కిరణాలను గ్రహించడం ద్వారా మనల్ని రక్షిస్తుందన్నారు. యువీ కిరణాలు నేరుగా భూమి ఉపరితలాన్ని చేరుకుంటే, అది చర్మ క్యాన్సర్ లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందన్నారు. ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన అవసరం గురించి ప్రజల్లో అవగాహన పెంచుతూ ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచ ఓజోన్ దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. ఓజోన్ పొరను కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. రిఫ్రిజిరేటర్‌లు, ఎయిర్ కండిషనర్‌లలో వాడే క్లోరో ఫ్లోరో కార్బన్‌లకు బదులుగా హైడ్రో ఫ్లోరో కార్బన్‌లు, హైడ్రో ఫ్లోరో ఈథర్లు లాంటి సురక్షిత రసాయనాలను వాడాలని తెలిపారు. రసాయన శాస్త్ర విభాగధిపతి యం.హరిప్రియ క్లోరో ఫ్లోరో కార్బన్ లాంటి ఓజోన్ వినాశకాలు ఓజోన్ పొరతో చర్యనొంది దాన్ని ధ్వంసం చేసే విధానంపై వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, టి.రాంబాబు, ఆర్.శ్రీనివాస్, వీ.శ్రీధర్‌కుమార్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎక్కడైనా గంజాయి ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే "స్పెషల్ సర్చ్"లు ఏర్పాటు చేయడం జరుగుతుంది...

- ఎస్పి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పోలీసులు బాగా పనిచేస్తున్నారు
- డిఐజి, ఛార్మినార్ జోన్-VI తఫ్సీర్ ఇక్బాల్
- చెంగోముల్ పిఎస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఐజి



**వికారాబాద్ డెస్క్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):** జిల్లాలో ఎక్కడైనా గంజాయి ఉన్నట్లు అనుమానం వస్తే వెంటనే స్పెషల్ సర్చ్ లు చేయడం జరుగుతుందని చార్మినార్ జోన్ – VI డీఐజీ తాఫ్సీర్ ఇక్బాల్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీలలో భాగంగా డిఐజి, ఛార్మినార్ జోన్ (జోన్ –VI) తఫ్సీర్ ఇక్బాల్ మంగళవారం జిల్లాలోని చెంగోముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ భవనం, పరిసరాలను పూర్తిగా పరిశీలించి, రికార్డులు, కేసుల వివరాలు, మరియు వివిధ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...., జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు చాలా బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. చెంగోముల్ పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, కేసులలో కన్విక్షన్ రేటును పెంచాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు ప్రజలలో రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణపై అవగాహన పెంచాలని సూచించారు. గ్రామాలలో విలేజ్ పోలీస్ అధికారులను నియమించి, ప్రజలతో మమేకమై సైబర్ క్రైమ్ మరియు గంజాయి వంటి మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడైనా గంజాయి ఉన్నట్లు అనుమానం వస్తే, వెంటనే స్పెషల్ సెర్చ్ ఆపరేషన్లు మరియు నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డిఐజి పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ...ప్రజలతో మర్యాదగా మరియు స్నేహపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో స్వీకరించి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన గ్రామాలలో ప్రజలతో మమేకమై, శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని, రౌడీలు, అనుమానితులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా అధికారులను సంప్రదించవచ్చని, ఉన్నతాధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, పరిగి డిఎస్‌పి ఎన్. శ్రీనివాస్, పరిగి సిఐ శ్రీనివాస్ రెడ్డి, చెంగోముల్ ఎస్ఐ భరత్ కుమార్ రెడ్డి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# కేటీఆర్ హరీష్ రావులను కలిసిన మాజీ ఎమ్మెల్యే ఆనంద్





**వికారాబాద్, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16):** హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావులను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డా. మెతుకు ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వికారాబాద్ జిల్లాకు సంబంధించిన పలు రాజకీయ విషయాలను సుధీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. కేటీఆర్, హరీష్ రావులు బీఆర్ఎస్ పార్టీకి కృష్ణార్జునుల వంటి వారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ పార్టీని ఏమి చేయలేరని తెలిపారు.

## మల్కారం పిఏసిఎస్ చైర్మన్‌గా ప్రభుసాగర్



**శంషాబాద్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్) 5 :** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మల్కారం నూతన అధ్యక్షులుగా మేకల ప్రభుసాగర్ నూతనంగా ఛార్జ్ తీసుకున్నారు. రైతు సోదరులు సహకారసంఘం అభివృద్ధికి పాటు పడాలని సహకార సంఘం అధ్యక్షులు మేకల ప్రభుసాగర్ కు వెల్లడించారు. మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో పాలక వర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేకల ప్రభుసాగర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... సంఘంలో సభ్యులకు నూతనంగా ఋణ సదుపాయం కొరకు ధరకాస్తులు పెట్టుకోవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పిండి లక్ష్మి కృష్ణారెడ్డి, మూడావత్ రెడ్యా, ఎండీ వాజీద్ ఖాన్, సంఘ సెక్రెటరీ పి.జే. సురేందర్, నీరటి విక్రమ్, మరియు రైతులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

- ముడిమ్యాలలో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



**చేవెళ్ల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16):** చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ముడిమ్యాల సొసైటి చైర్మెన్ గోనె ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో డప్పుల దరువులతో, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతాప్‌రెడ్డి స్వంత డబ్బులతో యూనిఫాం,బెల్ట్, మాస్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. సొసైటి చైర్మెన్ ప్రతాప్‌రెడ్డి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, ఆయనకు దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలన్నారు. మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించేలా భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు**

చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీని వీడి ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో వై.సుధాకర్, జనార్ధన్, యాదయ్య, వెంకటయ్య, జి.సామయ్య, అబ్దుల్ నబి, అబ్దుల్ హఫీజ్, జె.సామయ్య, వై.శంకర్, దన్‌రాజ్, ఇ.రాజు, వై.జంగయ్య, జె.నరేష్, సురేష్, వేణు, దీపక్, మహేందర్, ఉదయ్, గోవర్ధన్‌రెడ్డి, రాము, సి.హెచ్. కరుణాకర్, దయాకర్, మధు, శ్రీకాంత్, పవన్, డేవిడ్, దర్శన్, శ్రీరాం, రాము, సన్నిలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు కృషి చేయాలన్నారు. ముడిమ్యాలలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అయ్యిందని, కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలాభివృద్ధి అని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పడాల రాములు, మాజీ సర్పంచ్ ప్రభాకర్, మండల ఓబీసీసెల్ అధ్యక్షులు సూర్యపేట శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు స్వరూప, సుమ లత, సీనియర్ నాయకులు హరికిషన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు నర్సింలు, దుర్గేశ్, నాయకులు పడాల మహేందర్, జంగారెడ్డి, సత్యనారాయణ, వాజీద్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, సాయిలు, రాంచెంద్రయ్య, రవి, భాస్కర్, సునీల్,మల్లేష్, నయీం, ఖాజమీయా, హనిఫ్, హైమాద్, చిరంజీవి, పడాల బాబుకుమార్, నిరంజన్, ప్రవీణ్, మల్లప్ప, దినేష్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులున్నారు.

# విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



విద్యార్తులకు పరీక్ష ప్యాడ్‌లను అందించిన వాసవి వనితా క్లబ్ సభ్యులు

**ఫరూఖ్‌నగర్, మేజర్‌న్యూస్ (సెప్టెంబరు 16):** మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో గల ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలలో వాసవి వనితా క్లబ్ ఆద్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. బుదవారం షాద్‌నగర్ పట్టణానికి చెందిన హెచ్‌పి గ్యాస్ డీలర్ ఇల్లూరి శ్రీనివాస్‌బాబు, రూపాదేవి దంపతుల సహాకారంతో విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్ లను అందించారు.

ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ అద్యక్షుడు కల్వ మాణిక్యం, జోన్‌చైర్‌పర్సన్ గుడిపల్లి వెంకటరమణ, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియ, కోశాదికారి పాపిశెట్టి స్వప్న, వనితా క్లబ్ జోన్ చైర్మెన్ కొండా రమాదేవి, పాఠశాల హెడ్ మాస్టర్ సక్కుబాయి, ఉపాద్యాయులు కృష్ణమ్మ, రేణుక, స్వప్న, ప్రవీణ్‌కుమార్, గ్రామస్థులు శివరాములు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియా.. యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు..

- యాలాల పిఏసిఎస్ వైస్ చైర్మన్ ఫిర్యాదుతో
- అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లు పట్టివేత



**వికారాబాద్ డెస్క్,మేజర్ న్యూస్(సెప్టెంబర్ 16):** దౌలాపూర్ గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ విఠల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ విఠల్ రెడ్డి మాట్లాడుతూ... నిబంధ నలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. ఎర్రమట్టి తవ్వకాలు అక్రమంగా తరలిస్తున్నారని మాకు నమ్మదగిన సమా చారం రాగా మేము అక్కడికి వెళ్లి పరిశీలించగా అక్కడ ఐదు టిప్పర్లు అందులో నాలుగు టిప్పర్ల మట్టి నింపి ఉండి ఒక టిప్పర్ ఖాళీగా ఉండగా వారి దగ్గర అనుమతి పత్రాలు చూపాలని కోరడంతో లేవని తెలిపాడు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తుండంతో మట్టిలోడు ఉన్న ఐదు టిప్పర్లను యాలాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం యాలాల పిఏసిఎస్ వైస్ చైర్మన్ వడ్డే రాములు మాట్లాడుతూ.. దౌలాపూర్ గ్రామ శివారులో ఎర్ర మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వద్దని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే

● జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి
● అట్టహాసంగా ప్రారంభమైన 69వ ఎస్‌జిఎఫ్ క్రికెట్ సెలక్షన్స్

**శామీర్ పేట్, మేజర్ న్యూస్ (సెప్టెంబర్, 16):**
ఉమ్మడి శామీర్ పేట్ 69వ ఎస్‌జిఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ సెలక్షన్స్ మంగళవారం తూముకుంట మున్సిపాలిటీ బొమ్మరాసిపేట్‌లోని శాంతినికేతన్ విద్యాలయ పాఠశాలలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి సెలక్షన్స్‌ను ప్రారంభించారు. శామీర్ పేట్, మూడు చింతలపల్లి మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, "విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎదుగుదలకు దోహదం చేస్తాయి. కానీ నేటి పరిస్థితుల్లో క్రీడలను పక్కన పెట్టి, కేవలం చదువులకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ వాటిని మొబైల్ ఫోన్లకు పరిమితం చేస్తున్నారు. దీనివల్ల యువత ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. ప్రతి పాఠశాల క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గెలుపోటములు సహజం. ఓటమికి కృంగిపోకుండా విజయాన్ని సాధించే దిశగా నిరంతరం పోరాడాలి. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి" అని సూచించారు.



ఎస్‌జిఎఫ్ జోనల్ క్రీడల కార్యదర్శి గుర్రం సత్తిరెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సరం జిల్లా స్థాయి అండర్-17 విభాగంలో జట్టు మొదటి స్థానంలో నిలిచిందని, అదే వరవడిని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా అండర్-17, అండర్-14 విభాగాల్లో ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఈ సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో జరగబోయే మేడ్చల్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ విద్యాలయ ప్రిన్సిపాల్ దీపక్ రతన్, వ్యాయామ ఉపాధ్యాయులు మదన్ మోహన్ రెడ్డి, నరేష్, రాజశేఖర్, పి. నరేష్, క్రికెట్ కోచ్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తట్టెపల్లి సబ్‌స్టేషన్ పరిదిలో
# కరెంటు అంతరాయం
### – ఉదయం 11నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు – ఏఈ రఘువీర్

పెద్దేముల్,మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16)॰
నేడు (బుదవారం) పెద్దేముల్ మండల తట్టెపల్లి సబ్‌స్టేషన్ పరిదిలో కరెంటు అంతరాయం ఉంటుందని పెద్దేముల్ విద్యుత్ ఏఈ రఘువీర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దేముల్ మండల తట్టెపల్లి సబ్ స్టేషన్‌లో పరిదిలోని అడ్కిచెర్ల, పాషాపూర్, ఓంలానాయక్‌తండా, తట్టెపల్లి, బండమీదిపల్లి, తట్టెపల్లి – (జైరాంతండా), సిద్దన్నమడుగు తండాతో పాటు పలు గ్రామాల్లో మరమ్మత్తులు ఉన్నందున ఈ సబ్ స్టేషన్ పరిదిలోని గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు.ఉదయం 11నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియేగ దారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఏఈ కోరారు.

## నేడు తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలి

● బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపు
● బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి



**వికారాబాద్ డెస్క్,మేజర్ న్యూస్( సెప్టెంబర్ 16):** సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా నిర్వహించాలని బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించిందని అందులో భాగంగా నేడు తాండూరు మండలం పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వారి వారి గ్రామాలలో జాతీయ జెండాను ఆవిష్కరించాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి తాండూర్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆవిర్భవ దినోత్సవంగా గత సంవత్సరం నిర్వహించారని, ఈ సంవత్సరం ప్రజా పాలన తెలంగాణ దినోత్సవం గా నిర్వహించాలని జీవో జారీ చేసినది దాన్ని వ్యతిరేకిస్తూ గ్రామ గ్రామాలలో బిఆర్ఎస్ శ్రేణులు జాతీయ జెండాను ఆవిష్కరించి తెలంగాణ విలీన దినోత్సవం నిర్వహించాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చొరువతో
# త్రాగునీటి సమస్య పరిష్కారం...

**యాలాల, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16):**
మండల కేంద్రంలో త్రాగునీటి సమస్య శాశ్వతంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చొరువతో పరిష్కరించిన యాలాల కాంగ్రెస్ పేరి రాజేందర్ రెడ్డి మంచినీటి బోరు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో వికారాబాద్ జిల్లా మాజీ కో ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ,గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు మోహిజ్,సహాయ కార్యదర్శి గొల్ల చందు,గ్రామ కమిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మారుతి,మైను,గడ్డం వెంకటయ్య గౌడ్,పేరి మధుసూదన్ రెడ్డి,దూస చంద్రశేఖర్,చాకలి సూరి(సుదర్శన్),సాయిలు,బాగాని రాజు మరియు కాలిని వాసులు పేరి రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రతి ఇంటికి పోషకాహారం

▸ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ▸ జాతీయ పోషణ మాసం నేటి నుంచి అక్టోబర్ 16 వరకు : సంక్షేమ అధికారి శారద

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మేజర్ న్యూస్ (సెప్టెంబర్, 16):**
"ప్రతి ఇంటికి పోషకాహారం, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం అందించడమే పోషణ మాసం లక్ష్యం. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిషోర బాలికలు ప్రత్యేకంగా లబ్ధి పొందుతారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆరోగ్య-పోషక ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించబడుతుంది" అని జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఏడాది జాతీయ పోషణ మాసం 8వ దఫాగా సెప్టెంబర్ 17(నేటి) నుంచి అక్టోబర్ 16 వరకు జరగనుంది. "ప్రతి ఇంటికి పోషణ – ప్రతి ఒక్కరికి ఆరోగ్యం" నినాదంతో అంగన్వాడి ఆధ్వర్యంలో గ్రామస్థాయి ప్రచారాలు, ఇంటింటి కార్యక్రమాలు చేపడతారు.

**కార్యక్రమాల ప్రాధాన్యత**

ఉబకాయం నివారణ, చెక్కర-ఉప్పు-నూనె అధిక వాడకం తగ్గించడం, ప్రీ స్కూల్ పిల్లల సంరక్షణ, తల్లిపాల ప్రాముఖ్యత, పురుషుల భాగస్వామ్యం, వోకల్ ఫర్ లోకల్ ద్వారా సామాజిక వేడుకలు వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు.

**జిల్లా స్థాయి అమలు**

జిల్లాలోని 793 అంగన్వాడి కేంద్రాల్లో ప్రతిరోజూ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు జరుగుతాయి. లబ్ధిదారులలో గర్భిణీలు 9,245 మంది, బాలింతలు 5,792 మంది, 0-6 సంవత్సరాల పిల్లలు 1,12,364 మంది ఉన్నారని అధికారులు తెలిపారు.

**అవగాహన-చర్యలు:**

గ్రామ ఆరోగ్య దినోత్సవాలు, కమ్యూనిటీ ఈవెంట్లు, పాఠశాల ప్రచారాలు, మహిళా సంఘాల సమావేశాలు, ఏఎన్ఎంలు-ఆశావర్కర్ల ఇంటి సందర్శనలు నిర్వహిస్తారు. చిన్నారులలో లోప పోషణను గుర్తించి నివారణ చర్యలు చేపడతారు. అంగన్వాడి ప్రాంగణాల్లో పోషణ వాటికలు, రక్తహీనత పరీక్షలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న వంటలపై అవగాహన కల్పిస్తారు. చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు వినియోగం ప్రోత్సహిస్తారు.

అలాగే ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, వ్యర్థాల నిర్వహణపై కూడా అవగాహన కల్పించబడుతుంది.

# పీఎమ్‌జేడీవై ఖాతాలకు తప్పనిసరి 'కేవైసీ" పునరుద్ధరణ

● ఆర్బీఐ-కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు
● ఖాతాదారులు వెంటనే సమర్పించాలి : శివ ప్రసాద్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,మేజర్ న్యూస్(సెప్టెంబర్,16):**
ప్రధాన మంత్రి జనధన్ యోజన కింద ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 55 కోట్లకు పైగా జీరో బ్యాలెన్స్ పొదుపు ఖాతాలు తెరవబడ్డాయి. ఈ పథకం సాధారణ ప్రజలకు విస్తృతంగా ఉపయోగపడింది. అయితే ఇప్పుడు ఆ ఖాతాలకు సంబంధించి కొత్త ఆదేశాలు వెలువడ్డాయి.

ఆర్బీఐ మరియు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం, పీఎమ్‌జేడీవై ఖాతాదారులు తప్పనిసరిగా తిరిగి KYC పత్రాలు సమర్పించాలి. ఇందుకు గుర్తింపు ధృవీకరణ పత్రం, చిరునామా రుజువు, పాన్ కార్డు వంటి పత్రాలు సమర్పించడం అవసరం. భవిష్యత్తులో ఖాతా ఆపరేషన్లలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు, ప్రతి ఖాతాదారు తమ బ్యాంకు శాఖలు, వ్యాపార ప్రతినిధులు , కస్టమర్ సర్వీస్ పాయింట్లు వద్ద వీలైనంత త్వరగా కేవైసీ పత్రాలను సమర్పించాలి. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ, "తప్పనిసరి KYC సమర్పణను నిర్లక్ష్యం చేస్తే ఖాతాలు నిలిపివేయబడే అవకాశం ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరూ వెంటనే ఈ ప్రక్రియ పూర్తి చేయాలి" అని సూచించారు.

సూర్య
www.suryaa.com

బుధవారం
17 సెప్టెంబర్ 2025

# కారోబార్లపై కనికరమేది?



మంచాల గ్రామపంచాయతీ భవనం

## ▶▶ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు

## ▶▶ కుటుంబాన్ని పోషించలేని దుస్థితి

మంచాల, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16) : గ్రామపంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న కారోబార్ల జీవితాలు దుర్భరంగా మారాయి. మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా 13 మంది కారోబార్లు పనిచేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేక విధులు నిర్వహిస్తున్నారు. తమను నూతన ప్రభుత్వమైనా కనుకరించకపోతుందా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. నెలకు కేవలం రూ.9500 వేతనంతో పనిచేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీల్లో కార్యనిర్వహక అధికారి నిర్వహించే పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. క్యాష్‌బుక్ రాయడం, ఇంటిపన్నులు, నల్లా పన్నులు, వసూలు చేయడం కొత్తగా నిర్మించే ఇళ్లకు అనుమతినివ్వడం, రికార్డులు రాయడం, పంచాయతీ సమావేశాల మినిట్స్ రాయడం, అజెండా తయారు చేయడం, సభ్యులకు చేరవేయడం, లైసెన్స్ ఫీజులు తదితర అన్నిరకాల పనులు కారోబార్లే నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యక్ష్యంగా పాల్గొని పథకాలు అమలు చేయడంలో, ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇన్ని రకాల పనులు చేస్తున్నా వారిని పట్టించుకున్నా నాథుడే కరువయ్యారు. కాగా, 2019లో అప్పటి ప్రభుత్వం గ్రామపంచాయతీల్లో పనిచేసే వాళ్లందరిని మల్టీపర్పస్ వర్కర్‌గా మారుస్తూ జీఓ తీసుకొచ్చింది.

★ అమలుకు నోచుకోని కోర్టు తీర్పు..

పంచాయతీ రాజ్ చట్టం (జీఓ నం. 557) ప్రకారం జనవరి 13, 1982 కంటే ముందు పదో తరగతి ఉత్తీర్ణులైన కారోబార్లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కారోబార్లకు అనుకూలంగా ట్రిబ్యునల్ కోర్టు తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపానపోలేదు. 2002లో పదేళ్ల సర్వీసు కలిగిన కారోబార్లందరికీ ఉద్యోగ ఉన్నతి కల్పించాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. కానీ ఆ తీర్పు సైతం అమలుకు నోచుకోలేదు. దీంతో వారు 2007లో తిరిగి హైకోర్టును ఆశ్రయించగా రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. అది కూడా బుట్టదాఖలైంది. పాతికేళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కరువైందని కారోబార్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్మికులు, ఎలక్ట్రీషియన్లు, అసిస్టెంట్లుగా ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



### కష్టమవుతోంది...

నేను నోముల గ్రామపంచాయతీల్లో 20 సంవత్సరాలుగా కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్నాను. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టతరంగా మారుతోంది. అంతే కాకుండా పనిభారంతో ఇబ్బందిపడుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– దూసరి భాస్కర్ గౌడ్, కారోబార్ల సంఘం మండల అద్యక్షుడు

### పర్మినెంట్ చేయాలి..



నేను గత 25 సంవత్సరాలుగా చెన్నారెడ్డి గూడ గ్రామంలో కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న.. ప్రభుత్వాలు మారినా మా బ్రతుకులు మాత్రం మారడం లేదు. కనీస వేతనం రాక పూట గడవని పరిస్థితి. కుటుంబ పోషణ భారంగా మారుతోంది. ప్రభుత్వం తమను పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలు చేయాలి.

– గ్యార పాండు, కారోబార్, చెన్నారెడ్డి గూడ, (గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అద్యక్షుడు)

# మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం...

▶▶ "రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ అదుపు తప్పి యువకుడు మృతి"

▶▶ "డివైడర్ ఢీకొట్టిన బైక్ - అక్షిత్ రెడ్డి అక్కడికక్కడే మృతి"

▶▶ "మరో యువకుడు స్కూటీపై పడటంతో గాయాలు - ఆసుపత్రికి తరలింపు"

బాలాపూర్, మేజర్ న్యూస్ ( సెప్టెంబర్ 16):మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం, స్థానికులను షాక్‌కు గురిచేసింది. ఈ ఘటనలో 21 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.మీర్ పేట్ సిఐ శంకర్ నాయక్ సమాచారం ప్రకారం, అక్షిత్ రెడ్డి (21), భూపతి రెడ్డి కుమారుడు, నివాసం ప్రశాంత్ హిల్స్, మీర్ పేట్, రాజా రామ్ (21), నివాసం మీర్ పేట్ పోస్టాఫీస్ సమీపం, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ (%ూ–07–ూ%–0229) పై ఆల్మాస్‌గూడ నుండి మీర్ పేట్ వైపు వస్తున్నారనీ, రాత్రి సుమారు 01:30 గంటల సమయంలో ప్రశాంత్ హిల్స్–అల్మాస్‌గూడ కామన్ మధ్య, బాలాజీ మిఠాయి షాప్ ఎదురుగా, బైక్ వేగంగా వెళ్లడం వల్ల అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టినట్లు ఫిర్యాదు మేరకు వెల్లడించారు.ఘటనలో అక్షిత్ రెడ్డి రోడ్డుపై పడిపోగా, రాజా రామ్ ఎదురుగా వస్తున్న స్కూటీపై పడటంతో స్కూటీ రైడర్‌తో పాటు గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని డి ఆర్ డి ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు అక్షిత్ రెడ్డి అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు.



ప్రమాదం జరిగిన ప్రదేశంలో రాత్రి సమయంలో వెలుతురు తక్కువగా ఉండటమే కాకుండా, బైక్ అతివేగం కూడ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అక్షిత్ రెడ్డి, రాజా రామ్ ఇద్దరూ స్నేహితులు కాగా, తమ నివాస ప్రాంతమైన మీర్ పేట్ వైపు తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.మృతుడు అక్షిత్ రెడ్డి మృతిచెందిన వార్త విని కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటన ప్రాంతంలో దుఃఖసంతాపాలు వెల్లువెత్తాయి.మీర్ పేట్ పోలీసులు కేసు నమోదు చేసి, బైక్ వేగం, డ్రైవింగ్ పరిస్థితులు, ఇతర కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ శంకర్ నాయక్ తెలిపారు. ప్రజలు రాత్రి సమయంలో అతివేగంగా డ్రైవింగ్ చేయరాదని, హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.






## అనుమతి లేకుండ ఇసుక తరలిస్తున్న లారీలు, టిప్పర్ పట్టివేత

మాడ్గుల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): మాడ్గుల మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో మంగళవారం ఉదయం ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండ ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ఒక టిప్పర్, ఇసుక తరలింపుకు ఉపయోగించిన జెసిబి వాహనాలను సీజ్‌చేసి కేసు నమోదుచేసినట్లు మాడ్గుల సి.ఐ వేణుగోపాల్ తెలిపారు. ఈమేరకు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న లారీలు, టిప్పర్, ఉపయోగించిన జెసిబి వాహనాలను సీజ్ చేసి బాధ్యులైన 8మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సి.ఐ వేణుగోపాల్ తెలిపారు.

## విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



**మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి**

కందుకూరు, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మండల బీజేపీ అధ్యక్షులు నిమ్మ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పత్రికలో తెలుపుతూ.. తెలంగాణ విమోచన కోసం ఎంతో మంది పోరాడి ప్రాణ త్యాగం చేసి నిజాం నిరంకుశ పాలన నుండి విముక్తి కలిగించారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి జన్మదినం పురస్కరించుకుని రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కందుకూరు మండల కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. మండల కేంద్రంలో జాతీయ పతాకం ఆవిష్కరణ చేయడంతో పాటు ప్రతి గ్రామంలో బూత్ అధ్యక్షులు జాతీయ పతాకం ఎగురవేయాలని తెలిపారు. బూత్ అధ్యక్షులు, గ్రామ, మండల, జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజా పాలన జాతీయ పతాకావిష్కరణను విజయవంతం చేయండి

కొందుర్గు, మేజర్‌న్యూస్(సెప్టెంబర్ 16): తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం 9.45 గంటలకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే జాతీయ పతాకావిష్కరణను విజయవంతం చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి లక్ష్మీ అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, మండల కేంద్ర వాసులు, యువతి యుకులు సకాలంలో కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపిడివో లక్ష్మీ అనురాధ కోరారు.

## సుఖ వ్యాధుల పైన అవగాహన సదస్సులు



మహేశ్వరం,మేజర్ న్యూస్ ( సెప్టెంబరు 16) : హెచ్ఐవి,ఎయిడ్స్,క్షయ వంటి సుఖ వ్యాధుల పైన అవగాహన సదస్సులు నిర్వహించామని జిల్లా కోఆర్డినేటర్ టి రామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రంగారెడ్డి జిల్లా దిశ ఆధ్వర్యంలో వైఆర్‌జి,కేర్ సుఖ వ్యాధులపై అవగాహన తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు ప్రతి ఒక్కళ్ళు హెచ్ఐవి ఎలా వస్తుంది ఎలా రాదు రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది అని చెప్పారు నేటి విద్యార్థులే రేపటి పౌరులు ప్రతి ఒక్కరూ హెచ్ఐవి ,ఎయిడ్స్ పైన పూర్తి అవగాహన ఉండాలని అన్నారు.విద్యార్థినీ విద్యార్థులు పెళ్లికి ముందు ఎలాంటి చెడు అలవాట్లు పెట్టుకోకూడదని చెడుకి దూరంగా ఉండాలని పెళ్లయిన తర్వాత కూడా చెడు ప్రవర్తనలో ఉండకూడదని తెలిపారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని దానికి వయసు సంబంధం లేదని ఇమ్యూనిటీ పవర్ బలహీన గా ఉంటే వచ్చే అవకాశాలు ఉన్నాయి అని చెప్పారు క్షయ వ్యాధికి పూర్తిగా ప్రభుత్వ మందులు ఉన్నాయని చెప్పారు .క్షయ వ్యాధి లక్షణాలు దానికి ప్రభుత్వం చికిత్స అందిస్తున్న సేవలు గురించి తెలియజేశారు విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కళ్ళు ఇలాంటి ఆరోగ్య విషయాల పైన అవగాహన పెంచుకొని మీ జీవితాన్ని మంచి మార్గంలో ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కవితా కిరణ్ ఉపాధ్యాయులు ప్రసాద్ అహ్మద్ పాషా సత్యనారాయణ రెడ్డి విద్యార్థిని విద్యార్థులు లింక్ వర్కర్ లలిత కూడా పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


ఫరూఖ్‌నగర్, మేజర్‌న్యూస్ (సెప్టెంబరు 16): నేడు షాద్‌నగర్ పట్టణంతో పాటుగా పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా షాద్‌నగర్ లోని అన్ని కాలనీలతో పాటుగా ఫరూఖ్‌నగర్, నాగుల పల్లి, రాసుమల్లగూడ, సోలీపూర్, సాయిబాలాజి టౌన్ షిప్‌లలో ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సంపూర్ణ సహకారం

- కూభ్యతాండ ఎంపిపిఎస్‌ను దత్తత తీసుకొని రూ.20వేల సొంత నిధులతో బోర్‌మోటార్‌ను ప్రారంభించిన ఏఎమ్‌సి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి
- సొంత నిధులతో 30మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసిన మాడ్గుల మాజీ సర్పంచ్ సూధిని సునితకొండల్‌రెడ్డి
- మండలస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం దక్కించుకున్న స్వప్న, హెచ్‌ఎం ఆంజనేయులుకు సత్కారం
- ఎంపి, ఎమ్మెల్యేల సహకారంతో కూభ్యతాండ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తాం : ఏఎమ్‌సి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల ప్రయోజనార్ధం వసతుల కల్పన, సౌకర్యాల పెంపుకు తమవంతు సంపూర్ణ సహకారం అందిస్తామని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌కమిటి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి అన్నారు. పేద, మధ్యతరగతివర్గాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన, సౌకర్యాల పెంపుకు ప్రభుత్వంతో పాటు దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ మేరకు మాడ్గుల మండలం కూభ్యతాండ ప్రభుత్వ పాఠశాలను మంగళవారం ఏఎమ్‌సి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాడ్గుల మాజీ సర్పంచ్ సూధిని సునితకొండల్‌రెడ్డి, మాడ్గుల మండల విద్యాధికారి సర్ధార్‌నాయక్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ సుదర్శన్‌లు స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 0 నుండి 30మందికి పెంచిన ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారం అందుకున్న పాఠశాల ఉపాధ్యాయురాలు స్వప్నలను వారు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నీటి సమస్య ఉన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏఎమ్‌సి మాజీ చైర్మన్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన బికెఆర్ 20వేల రూపాయల సొంత నిధులతో బోర్‌మోటార్‌ను సమకూర్చి స్థానికులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏఎమ్‌సి మాజీ చైర్మన్ మాట్లాడుతూ కూభ్యతాండ ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల సహకారంతో పాఠశాలలో వసతుల కల్పన, పాఠశాల అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని తెలిపారు. అదేవిధంగా మాడ్గుల మాజీ సర్పంచ్ సూధిని సునితాకొండల్‌రెడ్డి పాఠశాలకు చెందిన 30మంది విద్యార్థినీ, విద్యార్థులకు మధ్యాహ్నభోజనానికి అవసరమైన ప్లేట్లు, గ్లాసులు సమకూర్చి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఏఎమ్‌సి మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సూధిని సునితాకొండల్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు విష్ణు, రాకేష్, రమేష్, బాషనాయక్, రవి, రఘు, గోపాల్‌నాయక్, కోటి, పకీరా తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడమే నా లక్ష్యం



ఆమనగల్లు, మేజర్ న్యూస్ (సెప్టెంబర్ 16 ): శెట్టిపల్లి గ్రామ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం అన్నారు. వ ం ఎ గ ళ వా ర ం విజయదశమి పండుగ సందర్భంగా గ్రామనుంచి ఫిరోజ్ నగర్ ,శెట్టిపల్లి నుంచి పీర్లగుట్ట వరకు రోడ్డు అసౌకర్యంగా మారడంతో అట్టి రోడ్ల మరమ్మత్తుల కు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు బాగుంటేనే గ్రామ అభివృద్ధి జరుగుతుందని,బస్సు సౌకర్యం ఉంటుందని గ్రామం మీదుగా ప్రయాణించే బస్సులు, ప్రయాణికుల ఇలాంటి అసౌకర్యం కలగకుండా ఉంటుందని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాల నుంచి ముద్విన్ రోడ్డు వరకు వేముల చెరువు కట్ట పైన నుంచి, ఫిరోజ్ నగర్ వరకు మొరం పోసి చెట్లను నాటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆయన పేర్కొన్నారు. శెట్టిపల్లి లక్ష్మయ్య, తుర్కోనిబాయి నుంచి, దూల లక్ష్మమ్మ పొలం వరకు, మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం రూ. 3, లక్షల సొంత నిధులతో రోడ్డుపై మెర్రం చల్లించడం జరిగిందన్నారు. అదేవిధంగా గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన కొమ్ము మల్లమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5, వేల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం అభినందనీయం

–సామాజికవేత్త రామకృష్ణారావు



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16)ః ప్రభుత్వ పాఠశాలకు దాతల సహకారం ఎంతో అవస రమని సామా జికవేత్త రామకృష్ణారావు అన్నారు. చేవెళ్లకు చెందిన వ్యాపారవేత్త జూకన్నగారి జైపాల్‌రెడ్డి తనయుడు గీత్ శ్రీనందన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం చేవెళ్ల బాలికల ఉన్నత పాఠశాలకు బీరువా, కూర్చీలు తదితర సామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పుట్టినరోజు వేడుకలను హంగుఆర్బాటాలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలకు ఉపయోగపడే వస్తువులను జూకన్నగారి జైపాల్‌రెడ్డి కుమారుడు పుట్టినరోజు సందర్భంగా అందజేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ సహకారంతో పాటు దాతల సహకారం కూడా అవసరమన్నారు. పాఠశాలకు వస్తువులందించిన జూకన్నగారి గోపాల్‌రెడ్డి,సుశీలమ్మ, జైపాల్‌రెడ్డి గీత్ శ్రీనందన్‌రెడ్డిలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహరున్నిస బేగం, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్ జన్మదిన వేడుకలు



చేవెళ్ల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16)ఃచేవెళ్ల ఆర్డీవో కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ పుట్టినరోజు వేడుకలను మంగళవారం చేవెళ్ల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య ఆయనతో కేక్‌కట్ చేయించి శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకునేలా భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. అనంతరం సిబ్బంది, నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల కార్యాలయం డీప్యూటీ తహసీల్దార్ రాజేందర్, సీనియర్ అసిస్టెంట్ పాండు, గొల్లపల్లి మాజీ సర్పంచ్ లొంక శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గౌండ్ల యాదయ్య, నాయకులు బ్యాగరి విజయ్ తదితరులు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

– తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



మాడ్గుల, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): అనుకోని విధంగా అనారోగ్యానికి గురై ఆధునిక వైద్యానికి నోచుకోని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలు, మధ్యతరగతివర్గాల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి దోహదం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ మొహినోద్దీన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఈమేరకు నిరుపేద కుటుంబానికి చెందిన మొహినోద్దీన్‌కు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్యఖర్చులు మంజూరుచేయాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ మేరకు మంజూరైన 25వేల 500 రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం గోలి శ్రీనివాస్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మొహినోద్దీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదానికి గురైన తనకు ప్రభుత్వం ద్వారా వైద్య ఖర్చులు మంజూరుచేయించిన రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల మండల జిఎస్‌ఆర్ యువసేన నాయకులు యాదయ్య, బాబర్, నబి, బాధితుడు మోహినోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

– కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): వానాకాలం పంటల సాగు చేసిన అన్నదాతలకు యూరియా పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు.కేంద్రంలోని నరేంద్రమోది ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అందించే యూరియా పంపిణీలో పూర్తిగా విఫలమెయ్యాయని ఆయన విమర్శించారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామంలో రైతులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం ముగిస్తున్న రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదని, అప్పులు చేసి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వాలు అందించే ఎరువుల పంపిణీలో రైతులకు సరైన న్యాయం జరగకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి అవసరంలేని రాష్ట్రాలలోని యూరియాను ఇక్కడికి రప్పించి రైతుల ఇబ్బందులు తీర్చవలసిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జోలం జయమ్మ వెంకటయ్య, బి ఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి శరత్ చంద్ర బాల కుమార్ గౌడ్ తదితరులున్నారు.

## జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి – తలకొండపల్లి మాజీ ఎంపిపి సి.ఎల్ శ్రీనివాస్‌యాదవ్



తలకొండపల్లి, మేజర్‌న్యూస్ (సెప్టెంబర్ 16): ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజహితానికి పాటుపడుతున్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, అఖిలభారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తలకొండపల్లి మాజీ ఎంపిపి సి.ఎల్ శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. సమాజంలో చీకటి కోణాలను వెలికితీస్తూ ప్రజల పక్షాన నిలిచే జర్నలిస్టులు ఎలాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న కందుకూరు మండల కేంద్రంలో నిర్వహించే టిడబ్లుజెఎఫ్ రంగారెడ్డి జిల్లా తృతీయ మహాసభలకు సంబంధించి రూపొందించిన ప్రచార కరపత్రాలను మంగళవారం టిడబ్లుజెఎఫ్ జిల్లా నాయకులు సిరుసవాడ చంద్రశేఖర్ ప్రజాపతి, జిల్లా మహాసభల సమన్వయకమిటి ఆమనగల్లు కన్వీనర్ యూనూస్, టిడబ్లుజెఎఫ్ ఆమనగల్లు బ్లాక్ కమిటి అధ్యక్షులు దర్వుల శంకర్, గౌరవాధ్యక్షులు ఆర్. నర్సింహ్మా, ఉపాధ్యక్షులు చప్పిడి తిరుపతిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా సిఎల్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ జిల్లాలోని జర్నలిస్టులు అందరి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.జర్నలిస్టులకు ప్రభుత్వపరంగా దక్కాల్సిన విద్య, వైద్య, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలుచేయాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. జర్నలిస్టుల మహాసభల విజయవంతానికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని సి.ఎల్ శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు.